

ఒత్తిడి

- విద్యార్థులపై పెరుగుతున్న చదువు భారం
- పగలంతా తరగతులు.. రాత్రయితే వర్కులు
- విశ్రాంతి లేక అల్లాడిపోతున్న విద్యార్థులు
- రాత్రి ఒంటిగంట వరకు వర్కులే వర్కులు
- ఉదయం 8 గంటలకే తరగతులు
- ఒత్తిడి, నిద్రలేమితో విద్యార్థుల అవస్థలు
- సైకాలజిస్టులకు పెరుగుతున్న కేసులు

● చిట్టినగర్‌కు చెందిన ఓ విద్యార్థిని బెంజిసర్కిల్ సమీపాన ఉన్న ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతోంది. రాత్రి 7 గంటల వరకు కళాశాలలో ప్రత్యేక తరగతులు ఉంటాయి. ఇంటికి వెళ్లాక భోజనం చేసి 8 గంటలకు హోంవర్క్ మొదలు పెడుతుంది. ఆ వర్క్ పూర్తి చేయడానికి రాత్రి ఒంటిగంట అవుతుంది.

● కృష్ణలంకకు చెందిన ఓ విద్యార్థి వన్‌టౌన్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నాడు. రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకుంటాడు. భోజనం చేశాక 8 గంటలకు పుస్తకాలు పట్టుకుంటాడు. పేజీలకొద్దీ రాస్తుంటాడు. రోజూ హోంవర్క్ పూర్తిచేసుకుని రాత్రి నిద్రపోయే సరికి సమయం 1.30 నుంచి 2 గంటలవుతోంది.

పోటీ.. పోటీ.. పోటీ.. ఈ పేరుచెప్పి కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఇలాగే పిండేస్తున్నాయి. ఒత్తిడిని పెంచేస్తున్నాయి. ఫలితంగా చిన్న వయస్సులోనే చాలా మంది మానసిక సమస్యలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో నగరంలో సైకాలజిస్టుల వద్దకు వెళ్తున్న కేసుల్లో విద్యార్థులే ఎక్కువగా ఉండటం భయాందోళనకు గురి చేస్తోంది. భావిభారత పౌరుల భవితను ప్రశ్నార్థకం చేస్తోంది.

8లో

ల్యాండ్ కన్వర్షన్.. మాయ

- నగదు చెల్లించినా చలానాలు తీయకుండా పాత చలానా నంబర్లతో ఫైల్స్ ఓకే
- ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్ల రూపాయలు దారి మళ్లింపు
- మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నిర్వాకం
- చల్లపల్లిలో ఆడిట్ విభాగం పరిశీలనలో బయటపడ్డ అవినీతి వ్యవహారం
- ఆర్డీవో, ఆడిట్ విభాగం నివేదికలపై నేటికీ స్పందించని కలెక్టరేట్ అధికారులు

“ ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తుల వ్యవహారంలో భారీ అవినీతి జరిగింది. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఓ సీనియర్ అసిస్టెంట్ ప్రభుత్వానికి నగదు చెల్లించకుండానే పాత చలానాల నంబర్లతో కొత్త చలనాలు సృష్టించి కోట్ల రూపాయలు మాయం చేశాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే బావమరిదితో కలిసి సదరు ఉద్యోగి నడిపిన ఈ 'సాంకేతిక' భాగోతం ఆడిట్ విభాగం అధికారుల పరిశీలనలో బయటపడింది. భూ రికార్డుల తయారీలో అత్యంత 'చైతన్య'వంతుడిగా పేరొందిన సదరు ఉద్యోగి భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడినట్లు తేలినా నేటి వరకు చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. - ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

ల్యాండ్ కన్వర్షన్ చేయాలంటే..

వ్యవసాయ భూమిని వేరే అవసరాల కోసం ల్యాండ్ కన్వర్షన్ చేయాలంటే ముందుగా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలి. గ్రామంలో భూమి విలువ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎంతమేర నమోదై ఉంటే ఆ విలువలో ఐదుశాతం చలానా రూపంలో చెల్లించాలి. నగదును ఆన్‌లైన్ ద్వారా లేదా బ్యాంకుల ద్వారా చెల్లించి, సంబంధిత పత్రాలను తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలి. తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఈ భూ మిని, భూమికి సంబంధించిన అన్ని పత్రాలు, రిజిస్ట్రార్ కార్యాలయంలో చెల్లించిన నగదు చలానా పరిశీలించి ఆర్డీవో కార్యాలయానికి ఈ ఫైలును పంపుతారు. అనంతరం ఆర్డీవో స్వయంగా భూమిని పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు ఇస్తారు.



మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం

ఆడిట్‌తో వెలుగులోకి..

చల్లపల్లి మండలంలో వ్యవసాయ భూమిని రియల్ ఎస్టేట్, ఇతరత్రా అవసరాల కోసం మార్చేందుకు ఇటీవల కాలంలో నాలుగు దరఖాస్తులు ఆర్డీవో కార్యాలయానికి వచ్చాయి. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ ఈ దరఖాస్తుదారులకు అన్ని వ్యవహారాలు తానే చూసుకుంటాను, చలానాలు కూడా చెల్లిస్తానని చెప్పి నగదు వసూలు చేశాడు. పాత చలానా నంబర్లను వేసి ఫైళ్లు సిద్ధం చేశాడు. అన్నీ సక్రమంగా ఉన్నట్లుగా చూపి ఆర్డీవోతో సంతకాలు చేయించాడు. చల్లపల్లి మండలంలో ఆడిట్ విభాగం అధికారులు ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేస్తుండగా ఒకే నంబర్లతో అనేక చలానాలు, నగదు లెక్కల్లో తేడాలు కనిపించాయి. రిజిస్ట్రార్ కార్యాలయంలో చలానాల రూపంలో నగదు చెల్లించకుండా అనుమతులు ఇచ్చినట్లుగా రుజువైంది. పాత చలానాల నంబర్లతో నూతన చలానాలను సృష్టించి నాలుగు ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించిన ఫైళ్లలో రూ.8 లక్షల వరకు మోసం జరిగినట్లు తేల్చారు. సీఎఫ్ఎం ఎస్‌లో క్యూఆర్ కోడ్ కొడితే నగదు చెల్లింపులు జరగనట్లుగా తేలింది. దీంతో ఆడిట్ విభాగం అధికారులు ఈ అంశాన్ని సీసీఎల్ఏకు తెలియజేశారు. సీసీఎల్ఏ నుంచి ఈ అంశంపై విచారణ చేసి నివేదికను ఇవ్వాలని మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయానికి ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో పనిచేసిన ఆర్డీవో ఈ అంశంపై విచారణ చేసి ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ నిర్వాకంపై సీసీఎల్ఏకు, కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడంతోపాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణలో సంబంధిత ఉద్యోగి బావమరిదిపైన కూడా కేసు నమోదు చేశారు. ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి చల్లపల్లి మండలంలో అక్రమాలు బయట పడటంతో జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్‌లలో ఇటీవల కాలంలో జరిగిన ల్యాండ్ కన్వర్షన్స్‌కు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలన చేయాలని సీసీఎల్ఏ నుంచి జిల్లాకు ఆదేశాలు వచ్చాయి. ఈ వ్యవహారంలో దాదాపు రూ.3 కోట్ల వరకు కుంభకోణం జరిగినట్లుగా తేలిందని రెవెన్యూ అధికారులు, సిబ్బంది చెప్పుకుంటున్నారు.

నివేదికిచ్చి 2 నెలలు గడిచినా చర్యలు శూన్యం

మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ ల్యాండ్ కన్వర్షన్‌లో చేసిన అక్రమాలపై విచారణ చేసి మచిలీపట్నం ఆర్డీవోతో పాటు, ఆడిట్ విభాగం అధికారులు రెండు నెలల కిందట పూర్తి వివరాలతో కలెక్టరేట్‌కు నివేదిక పంపారు. ఈ ఫైలును కలెక్టర్‌కు పంపకుండా ఎ-సెక్షన్ అధికారులు జాప్యం చేస్తుండటంపై అనేక అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి.

మాకొద్దు 'సెంట్రల్'

- సెంట్రల్ నియోజకవర్గం వైపు చూడని మద్యం వ్యాపారులు
- షాపుల ఏర్పాటుకు అనాసక్తి.. తూర్పు, పశ్చిమవైపే మొగ్గు
- సెంట్రల్‌లో అధికార పార్టీ కమీషన్లే ప్రధాన కారణం
- నెలవారీ మామూళ్లు ఇవ్వాల్సిందేనని వ్యాపారులకు హుకుం
- సెంటిమెంట్‌ను కూడా ఫాలో అవుతున్న వ్యాపారులు
- రూటు మార్చుకుని తూర్పు, పశ్చిమవైపు చూపు



మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇన్ని రోజులు తెగ ఆరాటపడిపోయిన వ్యాపారులు సెంట్రల్ నియోజకవర్గం అంటే మాత్రం హడలెత్తిపోతున్నారు. సెంట్రల్ కంటే తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోనే షాపులు పెట్టుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. అసలు మద్యం వ్యాపారులు సెంట్రల్ నియోజకవర్గంవైపు ఎందుకు చూడట్లేదు..?, అధికార పార్టీ నేతల కమీషన్లకు భయపడుతున్నారా లేక సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారా..?

6లో

‘ గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో వాటర్ గ్రిడ్, దాని అనుసంధాన పనులను బడా కాంట్రాక్టర్లకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ ఉన్నతాధికారులతో పాటు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖలోని ఉన్నతాధికారులు ఈ వ్యవహారంలో చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. జల్ జీవన్ మిషన్- 2024 - 25లో చేపట్టే పనులతో పాటు, 2023-24లో మిగిలిపోయిన పనులకు సంబంధించి టెండర్లు పిలిచే క్రమంలో ఉన్నతాధికారులు ఈ ఆలోచన చేయడం తీవ్ర వివాదానికి దారి తీస్తోంది. అధికారుల తీరుపై చిన్న కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి ఆర్‌అండ్‌బీలో జరిగిన అనుభవాలను పరిగణలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శిస్తున్నారు.



పెద్ద కాంట్రాక్టర్ల జపం

- జల్ జీవన్ మిషన్ పనులు కట్టబెట్టేందుకు ప్రయత్నం
- ఆర్‌డబ్ల్యూఎస్ తీరుపై చిన్న కాంట్రాక్టర్ల ఆగ్రహం
- ఆర్‌అండ్‌బీ అనుభవాలను పరిగణలోకి తీసుకోవడంలేదని విమర్శలు

కమీషన్ల కోసమేనంటూ అధికారులపై ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా విభాగంలో జల్ జీవన్ మిషన్- 2024 - 25లో చేపట్టే పనులతో పాటు, 2023-24లో మిగిలిపోయిన పనులకు సంబంధించి అధికారులు టెండర్లు పిలవనున్నారు. మంచినీటి వనరులు ఉన్నచోట వాటర్ గ్రిడ్స్‌ను ఏర్పాటు చేయటంతో పాటు ఇక్కడి నుంచి మెయిన్ పంపింగ్ లైన్స్, గ్రామాలకు డిస్ట్రిబ్యూషన్ లైన్స్ అంతర్గత పైపులైన్ల నుంచి కుళాయి కనెక్షన్లు ఇచ్చే వరకు అన్ని పనులను పెద్ద కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుత విభజిత జిల్లాలను యూనిట్‌గా తీసుకుని ఒక జిల్లాకు ఇద్దరేసి పెద్ద కాంట్రాక్టర్లకు ఈ పనులను గంపగుత్తగా అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణలో బెడిసికొట్టినా!

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మోడల్‌ను ఇక్కడ అమలు చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ విధానం అక్కడ బెడిసి కొట్టడంతో చివరికి విధిలేని పరిస్థితుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. టెండర్లలో ఎవరైనా పాల్గొనవచ్చని.. బడా కాంట్రాక్టర్లకే పరిమితం చేయడం వెనుక కమీషన్ల దందా నడిచిందని చిన్న కాంట్రాక్టర్లు ఆరోపణలు సంధిస్తున్నారు. పెద్ద కాంట్రాక్టర్లు పనులు దక్కించుకుని పనులు చేయరని, వారు తిరిగి సబ్‌లీజులకు ఇస్తారని.. సబ్ లీజులకు తీసుకునేది చిన్న కాంట్రాక్టర్లేనని చెబుతున్నారు. పెద్ద కాంట్రాక్టర్లు వారి స్థాయికి సరిపోని పనులను సబ్ లీజులకు ఇచ్చి డబ్బులు ఎగవేయడం వల్ల ఇప్పటికే అనేక మంది నష్టపోయి ఉన్నారని, తామెవరం సబ్‌లీజులు తీసుకునేది లేదని చెబుతున్నారు. ఈ ఇబ్బందులన్నీ లేకుండా అందరికీ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఏకపక్షంగా వ్యవహరించడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తక్షణం జోక్యం చేసుకుని వివాదాస్పద నిర్ణయాలకు చెక్ పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అవినీతి

జల్ జీవన్ మిషన్-2024 పనుల వ్యవహారం వైసీపీ ప్రభుత్వంలో ఉన్నతాధికారులకు కామధేనువుగా మారింది. ఆర్‌డబ్ల్యూఎస్‌లో విచ్చలవిడిగా అవినీతి జరిగింది. కాంట్రాక్టర్లు అడ్డగోలుగా పనులు చేపట్టినా.. ప్రశ్నించకుండా వారు చెప్పినట్టుగా ఎంబుక్‌లలో నమోదు చేయటంతో పాటు చెక్ మెజర్‌మెంట్ కూడా చేశారు. అవినీతి వ్యవహారంలో కొందరు అధికారులు ఛార్జి మెమోలు కూడా తీసుకున్నారు. ఇక పనుల విషయానికి వస్తే బిల్లుల చెల్లింపుల విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శించడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి ఆసక్తి చూపలేదు. కొందరు చేస్తున్న పనులను కూడా నిలుపుదల చేశారు. చివరకు పనుల చెయిన్ లింక్ తెగిపోయింది. దీంతో పనులన్నీ ఒక తీరు, తెన్ను లేకుండా పోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పనులన్నింటినీ ఒక చైన్ లింక్‌గా చేపట్టేందుకు సంకల్పించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు మౌళిక ఆదేశాలు ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ ఉన్నతాధికారులు, పంచాయితీరాజ్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం పనులు స్పీడ్‌గా అవ్వాలంటే పెద్ద కాంట్రాక్టర్ల ద్వారానే సాధ్యమవుతుందన్న సరికొత్త వాదనలు తెరమీదకు తీసుకువచ్చారు.

ఆర్‌అండ్‌బీ అనుభవాలు కనిపిస్తున్నా..

వైసీపీ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో జిల్లాల ప్రాతిపదికన ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్లను రెండు వరుసలుగా విస్తరించేందుకు నిర్ణయించారు. అప్పట్లో నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ఆర్థిక సహకారంతో చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. టెండర్లలో పెద్ద కాంట్రాక్టర్లే అన్న నిబంధనను ప్రవేశపెట్టారు. పెద్ద కాంట్రాక్టర్ల వల్ల పనులు పరుగులు పెడతాయని అప్పుడు కూడా చెప్పారు. తీరా చూస్తే.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో టెండర్లు దక్కించుకున్న వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ ఈ పనులను సబ్‌లీజులకు అప్పగించటం ప్రారంభించింది. సబ్‌లీజుకు తీసుకోవడానికి చిన్న కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 13 ఆర్‌అండ్‌బీ రోడ్లకు టెండర్లు పిలవగా.. సగం రోడ్ల పనులు కూడా మొదలు కాలేదు. ఆర్‌అండ్‌బీ అనుభవాలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా కూడా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరు మారడంలేదు. పెద్ద కాంట్రాక్టర్ల జపమే కొనసాగిస్తున్నారు.

మల్లవల్లికి మంచిరోజులు

- పాత రేట్లకే ప్లాట్ల కేటాయింపునకు సర్కారు ఆమోదం
- సమస్యలు తొలగిపోవడంతో పారిశ్రామికవేత్తల హర్షం

6లో

పవన్ కల్యాణ్ ఆదేశాలు.. వెంటనే కదిలిన అధికారులు!

అపార్ట్‌మెంట్‌లో అపరిచితుడి హల్‌చల్!

6లో

మద్యం గ్లాసు ఖరీదు నిండు ప్రాణం

6లో

నేడు దుర్గగుడిలో గిరి ప్రదక్షణ

8లో

దుర్గగుడిలో మొదటి రోజు హుండీల ఆదాయం రూ.3.50 కోట్లు

మల్లవల్లికి మంచిరోజులు



» పాత రేట్లకే ప్లాట్ల కేటాయింపునకు సర్కారు ఆమోదం » సమస్యలు తొలగిపోవడంతో పారిశ్రామికవేత్తల హర్షం

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

మల్లవల్లి పారిశ్రామికవాడకు మంచిరోజులు రానున్నాయి. కృష్ణాజిల్లాలోని ఈ మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో నెలకొన్న సమస్యలపై ఏపీఐఐసీ ప్రతిపాదించిన ప్రణాళికను ప్రభుత్వం ఆమోదించింది. ఈ ఇండస్ట్రియల్ పార్కులో దాదాపు 150 ఎకరాల్లో అందుబాటులో ఉన్న ప్లాట్లను 349 మంది పారిశ్రామికవేత్తలకు పాత ధరల ప్రకారం ఎకరం రూ. 16.50 లక్షలకే కేటాయించాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అంతేకాకుండా స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద మల్లవల్లి పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల కల్పన పనులకు రూ. 1,000 కోట్ల రుణానికి ప్రభుత్వం హ్యాండ్ హోల్డింగ్‌కు ఏపీఐఐసీ చేసిన ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. దీంతో ఏడేళ్లుగా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మల్లవల్లి పారిశ్రామిక పార్కు అభివృద్ధిపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఈ పార్కులో ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలను గత జగన్ సర్కారు వేధింపులకు గురిచేయడంతో వారంతా యూనిట్లు నెలకొల్పకుండా వదిలేశారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు కేటాయించిన ప్లాట్లలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నారు. తమకు కేటాయించిన ప్లాట్లలో యూనిట్లను నెలకొల్పుతామని, గతంలో తమకు కేటాయించిన ప్లాట్లను పాత ధరలకే రిజిస్ట్రేషన్ చేయాలని, పరిశ్రమలు నెలకొల్పేందుకు అనువైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్, ఎస్‌ఏపీ ఇండస్ట్రియల్ అసోసియేషన్, నవ్యాంధ్ర ఇండస్ట్రీస్ అసోసియేషన్, మల్లవల్లి స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ల ప్రతినిధులు గత మూడు నెలలకు పైగా ప్రభుత్వంతో జరుపుతున్న సంప్రదింపులు ఎట్టకేలకు ఫలించాయి.

ఏడేళ్లుగా అతీగతీ లేక..

రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం కృష్ణా జిల్లా మల్లవల్లిలో బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు (మోడల్ ఇండస్ట్రియల్ పార్కు)ను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. 2017లో దాదాపు 1,350 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పిలుపు మేరకు మల్లవల్లి పారిశ్రామిక పార్కులో భారీ పరిశ్రమలతోపాటు చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పేందుకు అనేక మంది పారిశ్రామికవేత్తలు దరఖాస్తులు చేసుకున్నారు. వారి దరఖాస్తులను పరిశీలించిన ఏపీఐఐసీ అధికారులు అశోక్ లేలాండ్, పార్లే వంటి పెద్ద పరిశ్రమలతో పాటు వందల సంఖ్యలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్లాట్లు కేటాయించారు. అప్పట్లో ఉన్న భూమి విలువ, మౌలిక సదుపాయాల కల్పనకు కలిపి ఎకరానికి రూ.16.50 లక్షలు చొప్పున ఏపీఐఐసీ వసూలు చేసింది. అయితే 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వచ్చీ రావడంతోనే కక్షపూరిత రాజకీయాలకు తెరలేపింది. మల్లవల్లి పార్కులో భూములు కేటాయించిన పారిశ్రామికవేత్తలపై తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులనే ముద్ర వేసి రకరకాలుగా వేధింపులకు గురిచేసింది. ఆ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా వదిలేయడంతో ఆ భూములు నిరుపయోగంగా ఉండిపోయాయి. ఈలోగా ఆ భూములు ఇచ్చిన రైతులు తమకు నష్టపరిహారం చెల్లించలేదంటూ కోర్టుకు వెళ్లారు. మరికొన్ని లిటిగేషన్ భూములున్నాయి. ఈ వివాదాలపై పారిశ్రామికవేత్తలు ఏపీఐఐసీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దాంతో ఆ వివాదాస్పద భూములు తమకు వద్దని, ఎలాంటి వివాదాలు లేని భూములు ఇవ్వాలని పారిశ్రామికవేత్తలు గత ప్రభుత్వాన్ని కోరారు. దాంతో జగన్ సర్కారు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మల్లవల్లి పార్కులో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన భూములను రద్దు చేసినట్లు ఏపీఐఐసీ ద్వారా నోటీసులు ఇప్పించింది. ఆ నోటీసులపై దాదాపు 150 మంది పారిశ్రామికవేత్తలు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ఈ గొడవలన్నీ పడలేక సగం మంది తాము కట్టిన డబ్బు వెనక్కి తీసేసుకున్నారు. మిగిలిన సగం మంది పారిశ్రామికవేత్తలు కట్టిన డబ్బంతా ఇన్నేళ్లుగా ఏపీఐఐసీ దగ్గరే ఉండిపోయింది. అంటే అప్పట్లో ఎకరం 16.50 లక్షల చొప్పున 150 ఎకరాలకు చెల్లించిన దాదాపు రూ. 25 కోట్లు దాకా ఏపీఐఐసీ దగ్గరే ఉండిపోయింది. వీరిని కూడా ఎలాగైనా తరిమేయాలని భావించిన జగన్ ప్రభుత్వం.. మల్లవల్లి పార్కులో స్థలాల రేట్లను అమాంతం పెంచేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎకరా భూమిని రూ.16.50 లక్షల చొప్పున కేటాయించగా.. జగన్ ప్రభుత్వం అదే భూములకు ఎకరా రూ. 65 లక్షలు చొప్పున కొత్త ధరలు నిర్ణయించింది. ఈ రేటు చెల్లిస్తేనే ఆ భూములను తిరిగి కేటాయిస్తామంటూ ఏపీఐఐసీ ద్వారా మరోసారి నోటీసులు పంపింది. అప్పటికే కోర్టులో కేసులు వేసిన పారిశ్రామికవేత్తలంతా మళ్లీ ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఐదేళ్లు గడిచిపోయాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయి.. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మల్లవల్లి పారిశ్రామికవాడలో ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలంతా మళ్లీ తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఏడేళ్ల క్రితం మల్లవల్లి పార్కులో తమకు కేటాయించిన ప్లాట్ల విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వ పెద్దలను కలిశారు. వారి అభ్యర్థనలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. వారికి గతంలో కేటాయించిన పాట్లను పాత ధరలకే ఇచ్చేందుకు ఆమోదం తెలపడంతో మల్లవల్లి పార్కులో యూనిట్లు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు సమాయత్తమవుతున్నారు.

18 నెలల్లో యూనిట్లు నెలకొల్పుతాం

జీఎన్‌బీ చౌదరి, మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

"మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ సమస్యలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పారిశ్రామికవేత్తల్లో మళ్లీ నమ్మకం పెరిగింది. ఎంఎస్ఎంఈ రంగం పట్ల, పారిశ్రామికీకరణ పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను స్వాగతిస్తున్నాం. మల్లవల్లి పార్కులో 18 నెలల్లోనే అన్ని యూనిట్లను నెలకొల్పి ఉత్పత్తి ప్రారంభించేలా మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ తరపున చర్యలు తీసుకుంటాం. ఈ పార్కులో 164 ఎకరాల్లో రూ. 1100 కోట్ల పెట్టుబడితో 380 పరిశ్రమలు నెలకొల్పేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉంది.దీని ద్వారా 10,800 మందికి ఉద్యోగాలు లభిస్తాయి" అని మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీఎన్‌బీ చౌదరి తెలిపారు. తమ సంఘ అధ్యక్షుడు కె.సాయికిశోర్‌తో కలిసి బుధవారం సాయంత్రం ఆయన రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.





నీటి నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది, ల్యాబ్‌లో పరీక్షలు (కింద)

పవన్ కల్యాణ్ ఆదేశాలు.. వెంటనే కదిలిన అధికారులు!

» 43 గ్రామాల్లో నీటి నమూనాల సేకరణ

» పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలింపు

» నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు : వెనిగండ్ల

గుడివాడ/గుడ్లవల్లేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగలో భాగంగా నీటి సమస్య పరిష్కారానికి అధికారులు నడుం బిగించారు. నియోజకవర్గంలో 43 గ్రామాల్లో రక్షిత నీటి పథకాల దుస్థితిని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉపముఖ్యమంత్రి పవన్‌కు వివరించారు. తక్షణమే ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటిసరఫరా విభాగ అధికారులను పవన్ ఆదేశించారు. 24 గంటలు గడవక ముందే అధికారులు రంగంలోకి దిగారు. నియోజకవర్గ పరిధిలోని గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లోని 43గ్రామాల్లో తాగునీరు రంగుమారింది. పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో బుధవారం ఆయా గ్రామాల ఇంజినీరింగ్ సిబ్బంది ఆరు బృందాలుగా గ్రామాల్లో నీటి నమూనాలను సేకరించారు. అదే విధంగా తాగునీటి సమస్యపై ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించారు. సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు తరలించి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తా : ఎమ్మెల్యే వెనిగండ్ల

ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత పథకాల ద్వారా సరఫరా అవుతున్న నీరు రంగుమారి దుర్గంధం వెదజల్లుతున్నట్టు తన దృష్టికి ప్రజలు తెచ్చారన్నారు. నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తానని నాడు హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఇదే విషయం ఉపముఖ్యమంత్రి పవన్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలివ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

నేటికి పూర్తిస్థాయి నివేదిక : ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్

పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు 43 గ్రామాల్లో తాగునీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌ల్లో పరీక్షిస్తున్నామని, గురువారం నాటికి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. మూడేళ్లుగా రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు చేపట్టలేదని, ఫిల్టర్ బెడ్‌లు పూర్తిగా పాడైపోయాయని దీంతో నీటిని శుద్ధి చేయలేకపోతున్నాయన్నారు. ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులకు రూ.3.30కోట్ల అంచనాలతో ప్రణాళికలను ఉన్నతాధికారులకు పంపించినట్టు గ్రామీణ నీటిసరఫరా శాఖ ఈఈ నటరాజ్ పేర్కొన్నారు.



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్

పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధికి కృషి

» చల్లపల్లి పల్లె పండుగలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలో పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధికి కృషిచేస్తానని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గ్రామంలో రూ.1.27 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం అగ్రహారంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐదేళ్లలో చల్లపల్లిలో నూరుశాతం సీసీ రోడ్ల నిర్మాణానికి కృషిచేస్తానన్నారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కృషిచేస్తున్నట్టు తెలిపారు. ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలియజేయాలని పార్టీ శ్రేణులను కోరారు. గుల్లలమోదలో క్షిపణి పరీక్ష కేంద్రం నిర్మాణం ప్రారంభమైతే అనుబంధంగా వచ్చే పరిశ్రమలు చల్లపల్లిలో ఏర్పాటుచేసేలా కృషిచేస్తానన్నారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీడీవో ఏవీ రమణ, డీఈఈ పి.సురేష్‌బాబు, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఆసుపత్రి డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



కోచింగ్ సెంటరు ప్రారంభోత్సవంలో మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

విజయవాడలోనే సివిల్స్‌కు శిక్షణ

పెనమలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సివిల్స్ శిక్షణకు దూరప్రాంతాలకు వెళ్లకుండా విజయవాడలోనే శిక్షణ అందుబాటులో ఉండటం సంతోషకరమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం కానూరు టైమ్ ఆసుపత్రి సమీపంలోని ప్రతిభ సివిల్స్ అకాడమీని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు. మంచి శిక్షణతో విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టాలని అకాడమీ డైరెక్టర్ జంపాన సుధాకర్‌కు సూచించారు. కొనకళ్ల మాట్లాడుతూ, గత 20ఏళ్లుగా సుధాకర్ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టారని కొనియాడారు. డైరెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ, ఇంటర్, డిగ్రీ స్థాయిలోనే సివిల్స్ కోచింగ్ ఇవ్వడం వల్ల విద్యార్థులు సులభంగా సివిల్స్‌లో విజయం సాధించడం వీలవుతుందన్నారు. సివిల్స్ శిక్షణతో పాటు అకాడమీలో ఆటలు, యోగా, ధ్యానం, మోటివేషన్ క్లాసులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రొఫెసర్ సూర్యచంద్రరావు, రిటైర్డు ఐఏఎస్ అధికారి అశోక్, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

పెడన రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెడన తోటమూల సెంటర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించగా, మరొకరికి గాయాలయ్యాయి. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిపై జంషెడ్‌పూర్ నుంచి చెన్నై మోటారు స్పేర్స్‌తో వెళుతున్న లారీ తోటమూల జంక్షన్ వద్ద వేకువజామున ముందున్న లారీ సడన్‌బ్రేక్ వేయటంతో ముందుభాగం నుజ్జు నుజ్జయి కో-డ్రైవర్ వారాల వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ నిమ్మగడ్డ రామచంద్రయ్యకు స్వల్పగాయాలయ్యాయి. వెంకన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన మోత్కూరు గ్రామ వాసిగా పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంకన్న కుమారుడు పృథ్వీరాజ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.సత్యనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్‌ల దొంగ అరెస్ట్.. రిమాండ్



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లి, విజయవాడ సత్యన్నారాయణపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలను చోరీ చేసిన వ్యక్తిని తిప్పనగుంట వద్ద వీరవల్లి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పలు స్టేషన్ల పరిధిలో నిలిపి ఉంచిన ఐదు బైక్‌లను దొంగిలించిన పొట్రు సాయిశేఖర్ అలియాస్ అయ్య అనే వ్యక్తి తిప్పనగుంట బస్‌స్టాప్ వద్ద ఉండగా వీరవల్లి పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు, విజయవాడ సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైక్, ఏలూరు, మంగళగిరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగిలించిన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. సాయిశేఖర్‌ను నూజివీడు కోర్టుకు హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఇరిగేషన్ కాంప్లెక్స్‌లో మంత్రి అచ్చెన్నకు గృహం కేటాయింపు

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ఇరిగేషన్ కాంప్లెక్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు గృహ వసతిని కల్పిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారంనాడు ఉత్తర్వు జారీ చేశారు. ఇప్పటికే కాంప్లెక్స్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా ఈ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తును కింజరాపు అచ్చెన్నాయుడుకు కేటాయించారు.

గ్లాసు మద్యం ఖరీదు నిండు ప్రాణం

» బార్‌లో మద్యం దొంగిలించాడని మందుబాబుల దాడి

» ఐదుగురిపై కేసు నమోదు.. ఆలస్యంగా వెలుగులోకి ఘటన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం హౌసింగ్ బోర్డులోని బార్‌లో మద్యం గ్లాసును దొంగిలిస్తున్న మందుబాబుపై యువకులు దాడి చేశారు. దీంతో అతడు మృతిచెందాడు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. చిలకలపూడి సీఐ నబి వివరాలు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం వద్ద ఉండి గ్రామానికి చెందిన గోర్ల వెంకటేశ్వరరావు (40) వారం క్రితం భార్యాపిల్లలను విడిచి మచిలీపట్నం వచ్చేశాడు. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో కాలం వెళ్లదీస్తున్నాడు. మద్యానికి పూర్తిగా బానిసైన వెంకటేశ్వరరావు హౌసింగ్ బోర్డు కాలనీలోని బార్‌లో టేబుళ్లపై ఉన్న మద్యం గ్లాసులు తస్కరించి తాగడం మొదలు పెట్టాడు. సోమవారం రాత్రి బార్‌లో కొందరు యువకులు తెచ్చుకున్న మద్యాన్ని సేవించడంతో కోపోద్రిక్తులై వెంకటేశ్వరరావుపై వారు విచక్షారహితంగా దాడిచేశారు. దాడిలో వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంకటేశ్వరరావును 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేశ్వరరావు సోమవారం రాత్రి మృతిచెందాడు. అయితే వెంకటేశ్వరరావును ఉండి గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు బుధవారం వెంకటేశ్వరరావు భార్య చిలకలపూడి స్టేషన్‌కు వచ్చి లబోదిబోమంది. వెంకటేశ్వరరావుకు ఇద్దరు పిల్లలు. వెంకటేశ్వరరావుపై దాడి చేసిన నిందితులను గుర్తించినట్టు సీఐ నబి తెలిపారు. ప్రధాన నిందితుడుగా కిరణ్ పేరును నమోదు చేశారు. దాడి చేసిన వారిలో రాంబాబు, సుబ్బారావు, నాగేశ్వరరావు, నాగరాజులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



మృతుడు గోర్ల వెంకటేశ్వరరావు

అపార్ట్‌మెంట్‌లో అపరిచితుడి హల్‌చల్!

» టీడీపీ నేత కారును అనుసరించి.. రెక్కీగా అనుమానం

» పోలీసులకు అప్పగింత

గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు కారు వెనుక గుర్తుతెలియని వ్యక్తి రెక్కీ నిర్వహించాడు. బుధవారం మండలంలోని సూరంపల్లి, వీరపనేనిగూడెం గ్రామాలకు వెళ్లి మధ్యాహ్నం 3.30 గంటలకు గన్నవరంలోని ఆయన నివాసానికి వచ్చాడు. జాస్తి వెంకటేశ్వరరావు వెనుక మరో కారులో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అక్కడే కూర్చున్నాడు. కొద్దిసేపటి తరువాత గాంధీ బొమ్మ సెంటర్‌లో కిరాణా షాపునకు వెళ్లి సరుకులు కట్టించాడు. వీటిని జాస్తి వెంకటేశ్వరరావు ఉండే అపార్టుమెంట్ వద్దకు తీసుకురావాలని చెప్పారు. వాటిని షాపు వాళ్లు అపార్టుమెంట్ వద్దకు తీసుకువెళ్లి డబ్బులు అడిగారు. తమ కంపౌండర్‌తో ఇచ్చి పంపినట్టు తెలిపాడు. సరుకులను అపార్టుమెంట్‌లోని వాచ్‌మెన్‌కు ఇచ్చి జాస్తి ఈ రాత్రికి వైజాగ్ వెళుతున్నారని సరుకులను పైన పెట్టమని చెప్పాడు. వాచ్‌మెన్‌కు అనుమానం రావటంతో ఎవరు ఏమిటని నిలదీశాడు. ఏమీ చెప్పకుండా మంచినీళ్లు అడిగాడు. వాచ్‌మెన్ మంచినీళ్లు తెచ్చేందుకు వెళ్లగానే అపార్టుమెంట్ పైకి వెళ్లాడు. నాలుగో ఫ్లోర్‌లో వృద్ధురాలు కనిపించటంతో దుప్పటి కప్పుకుని పక్కన నక్కాడు. అతడ్ని చూసి ఎవరు ఎవరు అని ఆమె అరవటంతో పారిపోయేందుకు ప్రయత్నించాడు. అపార్టుమెంట్ వాసులు అతడిని పట్టుకుని గన్నవరం పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు. తన వెనుక ఎందుకు రెక్కీ నిర్వహించాల్సి వచ్చిందో తెలియదని, వైజాగ్ వెళుతున్న విషయం కూడా ఎవరికి చెప్పలేదని అతడికి ఎలా తెలిసిందో అర్థం కావటం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని జాస్తి వెంకటేశ్వరరావు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.



అపార్ట్‌మెంట్ వద్ద గుర్తుతెలియని యువకుడు



జడ్పీ సమావేశాల్లో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు

శివారు గ్రామాల్లో నీటిఎద్దడి నివారించండి

» జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

మచిలీపట్నం,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : శివారు ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధికారులను ఆదేశించారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో జడ్పీ స్థాయి సంఘం సమావేశాలు బుధవారం జరిగాయి. ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, వైద్యం, వ్యవసాయం, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ, జిల్లాలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఫిల్టర్‌బెడ్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రంచేసి స్వచ్ఛమైన తాగునీటిని గ్రామీణప్రాంత ప్రజలకు అందించాలన్నారు. జల్‌జీవన్ మిషన్‌ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం..

జిల్లాలో పక్కాగృహాల పనులను వేగవంతం చేయాలని ఉప్పాలహారిక అన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించి వారిని చైతన్యవంతం చేయాలన్నారు. లేఅవుట్‌లలో తాగునీటి సౌకర్యం, విద్యుత్, డ్రెయిన్‌లు, రహదారులు, మెరకపనులు వంటి కనీస మౌలికవసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్, ఉపాధిహామీ పథకం నిధులతో ఉమ్మడిజిల్లాలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. పూర్తయిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు జడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించడం లేదని పలువురు సభ్యులు చెప్పగా హారిక మాట్లాడుతూ, ఈ అంశంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని, అధికారులు ప్రోటోకాల్‌ను పాటించాల్సిందేనన్నారు. పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ క్యాంపులు నిర్వహించి వారి ఆరోగ్య పరిరక్షణకోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, దీంతో కృష్ణా జిల్లాకు ఉత్తమ అవార్డు వచ్చిందని డీఎంఅండ్‌హెచ్‌వో గీతాభాయి తెలిపారు. బెల్‌కంపెనీ ఇచ్చిన కేన్సర్ స్క్రీనింగ్‌టెస్ట్ పరికరాలతో రానున్న రోజుల్లో గ్రామాలకు వైద్యసిబ్బంది వెళ్లి పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందించామని తెలిపారు. ఇటీవల వరదలు రాగా డ్రోన్లు, బోట్‌ల సాయంతో ఉమ్మడిజిల్లాలో అందరికీ మందులు అందజేశామని, అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టు ఎన్టీఆర్ జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో సుహాసిని తెలిపారు. వరదల సమయంలో అధికారులు చేసిన కృషిని చైర్మన్, సభ్యులు కొనియాడారు. జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మాకొద్దు సెంట్రల్!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

నగరానికి ఎక్సైజ్ శాఖ కేటాయించిన మద్యం షాపులు 39. లాటరీలో షాపులను దక్కించుకున్న వ్యాపారులు నగరంలోని మూడు నియోజకవర్గాల్లో 13 చొప్పున షాపులు ఏర్పాటు చేయాలని భావించారు. ఉన్నట్టుండి వీరంతా కొత్తగా ఒక నిర్ణయానికి వచ్చారు. సెంట్రల్ నియోజకవర్గం మినహా తూర్పు, పశ్చిమలోనే షాపులు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

కారణమేంటి?

సెంట్రల్‌ను కాదని.. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోనే వ్యాపారులు షాపులు ఏర్పాటు చేసుకోవాలనుకోవడం వెనుక ప్రధాన కారణం రాజకీయ నేతల కమీషన్లే. సెంట్రల్‌లో కొంతమంది అధికార పార్టీ నేతలు షాపులు దక్కించుకున్న వ్యాపారులకు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నారని సమాచారం. నెలవారీగా కమీషన్లు ఇవ్వాల్సిందేనని షరతులు విధిస్తుండటంతో ఈ నియోజకవర్గంలో షాపులు ఏర్పాటు చేసుకుందామని భావించిన వ్యాపారులు రూటు మార్చుకున్నారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. అలాగే, మద్యం షాపుల యజమానులు మరో సెంటిమెంట్‌ను కూడా ఫాలో అవుతున్నారు. సాధారణంగా ఏదైనా ఇల్లు కొనాలన్నా, అద్దెకు తీసుకోవాలన్నా తూర్పు, పశ్చిమవైపు ఉన్న గుమ్మాలు చూసుకుంటారు. మద్యం వ్యాపారులు కూడా ఇదే సెంటిమెంట్‌ను పాటిస్తున్నారు. అందులో భాగంగానే లాటరీలో నూతనంగా మద్యం దుకాణాలను దక్కించుకున్న వారంతా తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలను ఎంపిక చేసుకుంటున్నారు.

తూర్పు, పశ్చిమలో పెరిగిన పోటీ

సెంట్రల్‌లో ఉండాల్సిన వ్యాపారులంతా తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు రావడంతో ఈ రెండుచోట్లా పోటీ బాగా పెరిగింది. మొన్నటి వరకు సెంట్రల్‌లో ఉంటామని చెప్పినవారు తూర్పు, పశ్చిమలో షాపులు ఏర్పాటు చేయాలని భావిస్తుండటంతో ఇప్పటికే అక్కడున్నవారు అభ్యంతరం చెబుతున్నారు. తాము నిర్ణయించుకున్న ప్రాంతాల్లో షాపులు ఏర్పాటు చేస్తే ఇద్దరికీ వ్యాపారం ఉండదంటున్నారు. కానీ, సెంట్రల్ నియోజకవర్గంలో తాము షాపులు పెట్టలేమని, పశ్చిమ, తూర్పులో ఎక్కడైనా ఓకే అని కొందరు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇంకా ప్రొవిజనల్ లైసెన్స్ పొందడానికి వారం గడువు ఉంది. బుధవారం నుంచే షాపులు తెరుచుకున్నా.. వారంలో బ్యాంకు గ్యారెంటీలు, డాక్యుమెంట్లను ఎక్సైజ్ శాఖకు అందజేయాలి. వాటితో పాటు షాపు ఏర్పాటు చేయబోయే ప్రదేశాన్ని చూపించాలి. ఇవన్నీ సక్రమంగా ఉంటే ఎక్సైజ్ అధికారులు ఏడాది కాలానికి పర్మినెంట్ లైసెన్స్ ఇస్తారు. షాపులు దక్కాయన్న ఆనందంలో ఉన్న వ్యాపారులకు తాజాగా ఈ నియోజకవర్గాల గొడవ తలనొప్పిగా మారింది.

ఇలాగైతే ఎలా?

జిల్లాలో 113 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో నగరానికి 39 కేటాయించింది. ఈ మొత్తం షాపులకు రెండు రోజుల క్రితం లాటరీ తీశారు. నగరంలో ఏర్పాటుచేసే 39 షాపుల్లో సగానికి పైగా సిండికేట్లు తన్నుకుపోయారు. నాలుగైదు సిండికేట్లు 20కి పైగా షాపులను దక్కించుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం రాత్రితో మూసుకుపోయాయి. రాత్రి 9 గంటల తర్వాత ఈ మద్యం దుకాణాలను మూసేశారు. అనంతరం జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలోని మద్యం దుకాణాలకు వెళ్లారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన అమ్మకాల మొత్తాన్ని లెక్కించారు. అనంతరం షాపులో ఉన్న మద్యం సరుకును బ్రాండ్లవారీగా లెక్కించారు. మొత్తం అన్‌సోల్డ్ స్టాక్‌కు సంబంధించిన జాబితాను రూపొందించారు. ఈ సరుకును తిరిగి డిపోలకు అప్పగించారు. అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం ఉదయం బ్యాంకుల్లో జమ చేయించారు. కాగా, జిల్లావ్యాప్తంగా బుధవారం రాత్రికి సుమారు 25 కొత్త మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. ఇవన్నీ ఎక్సైజ్ శాఖ డిపోల పరిధిలోనివే.



వైసీపీ పాలనలో బాపులపాడు పేదల కాలనీ ప్రధాన మార్గం



కూటమి ప్రభుత్వం రాకతో..

ఐదేళ్ల నరకానికి విముక్తి!

- వైసీపీ పాలనలో నరకయాతన అనుభవించిన పేదల కాలనీ వాసులు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్థిక సంఘం నిధులు కేటాయింపు
- పనులు ప్రారంభించిన పంచాయతీ అధికారులు

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

కాలినడకన కూడా వెళ్లలేని అధ్వానంగా మారిన బాపులపాడు పేదల కాలనీ ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడానికి గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బాపులపాడు రైల్వే స్టేషన్ సమీపంలో ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసిన పేదల కాలనీ ప్రధాన మార్గం అభివృద్ధి చేయకపోవడంతో కాలనీ వాసులు గత ఐదేళ్ల తీవ్ర నరకయాతన అనుభవించారు. పేదల ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం ఎకరం రూ.80 లక్షలు చొప్పున దాదాపు రూ.2. కోట్లు వెచ్చించి 20 ఎకరాల ప్రైవేటు భూమిని కొనుగోలు చేసిన అధికారులు కాలనీ అంతర్గత రహదారులు, ప్రధాన మార్గాన్ని అభివృద్ధి చేయకుండా వదిలేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొన్నారు. పేద సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో నెలకొల్పిన పేదల కాలనీల్లో కనీస వసతులు కల్పించడంలో గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అలసత్వం ప్రదర్శించింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ చేరవేసు కోవడానికి కూడా కనీస మార్గంలేక లబ్ధిదారులు నానా యాతన పడ్డారు. లే అవుట్‌లో 632 మందికి ప్లాట్లు పంపిణీ చేశారు. అధికారుల ఒత్తిడితో 350 గృహాలు నిర్మాణం చేపట్టారు. సరైన రహదారులు లేక చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి. నరకయాతన పడుతూ ప్రస్తుతం వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కనీసం దైనందిన కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి కూడా సరైన మార్గంలేక కాలనీ వాసులు ఇబ్బందిని ఎదుర్కొన్నారు. కాలనీలో ఇళ్ల స్థలం రావడం శాపంలా భావించారు.

కూటమి ప్రభుత్వం రాకతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలనీ వాసులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి సమస్యను తీసుకురాగా ఆయన స్పందించి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని గ్రామ పంచాయతీ పాలక వర్గానికి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించి రహదారిని అభివృద్ధి చేయడానికి పూనుకుంది. అధ్వానంగా మారిన రహదారిని ముందుగా సిమెంట్ వ్యర్థాలతో మరమ్మతు చేసి మెటల్‌గ్రావెల్‌తో అభివృద్ధి చేయడానికి గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం అలసత్వంతో నరకయాతన అనుభవించిన కాలనీ వాసులు రహదారిని అభివృద్ధి చేయడానికి ముందుకు రావడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పల్లె పండుగతో పూర్వ వైభవం

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- సిరివాడ, ఆరుగొలను, పెరికీడు, కానుమోలు, బొమ్ములూరు, కొయ్యూరుల్లో రూ1.68 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సిరివాడ, ఆరుగొలను, పెరికీడు, కానుమోలు, బొమ్ములూరు, కొయ్యూరు గ్రామాల్లో రూ1.68 కోట్ల నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఆరుగొలనులో రూ.19.50 లక్షలతో రెండు సీసీ రోడ్లు, బొమ్ములూరులో రూ.8.50 లక్షలతో ఒకటి, కొయ్యూరులో రూ. 23లక్షలతో మరొకటి, పెరికీడులో రూ.14లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు ఉపాధిహామీ నిధులు మంజూరైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, కొమ్మారెడ్డి కిషోర్, మొవ్వా వేంకటేశ్వరరావు, మాదాల శ్రీనివాసరావు, మూల్పూరి వెంకటరత్నం, తుమ్మల బ్రహ్మాజీ, మేడికొండ సోంబాబు, బేతా శేషుబాబు, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికళ్యాణి, చింతల వెంకటశివఅప్పారావు, వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జోగేశ్వరరావు, జైరాజ్ పాల్గొన్నారు.



ఆరుగొలనులో సీసీ రహదారికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, చెలమలశెట్టి రమేష్‌బాబు

బాపులపాడులో సీసీ రోడ్లకు భూమిపూజ

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడులో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.76 లక్షలు విలువ చేసే పనులకు బుధవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భూమిపూజ చేశారు. కృష్ణానగర్, హనుమాన్ నగర్, ఇందిరానగర్‌లో మొత్తం నాలుగు సీసీ రోడ్లు, జడ్పీ హైస్కూల్ కాంపౌండ్ వాల్ పనులు నిర్మాణానికి సంబంధించిన కృష్ణానగర్‌లో భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సొమ్ము తిరిగి ఇవ్వలేదని ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్,అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వక పోవడం. మరో వైపు కోర్టు కేసులతో ఇబ్బంది పడుతూ వేలేరు గ్రామానికి చెందిన దోనవల్లి శేషుబాబు (40) గడ్డి మందు తాగి ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఆరేళ్ల క్రితం తన గ్రామానికి చెందిన దోనవల్లి గంగాధరరావుకు రూ.30 లక్షలు అప్పు ఇచ్చాడు. అతను తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. మరో పక్క గ్రామంలో దోనవల్లి మురళీ కృష్ణ వద్ద రూ.2లక్షలు అప్పుగా తీసుకొని చెల్లించినా.. బాకీ తీర్చలేదని మృతుడిపై రూ.11 లక్షలు బాకీ ఉన్నట్లు కోర్టులో కేసు వేశాడు. దీంతో మనస్తాపం చెంది మంగళవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రాణాపాయస్థితిలో శేషబాబును చిన్నఆవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఆకునూరులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ

ఉయ్యూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తూ పల్లెపండుగ కార్యక్రమం ద్వారా సీసీరోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టిందని, కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు మహర్దశ ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ఆకునూరులో రూ.19 లక్షలతో మూడు, గండిగుంటలో రూ. 34 లక్షలతో ఒకటి, చినఓగిరాలలో రూ. 29 లక్షలతో రెండు, పెద ఓగిరాలలో రూ. 14.50 లక్షలతో మూడు సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, చినఓగిరాల సర్పంచ్ యెనిగళ్ల శిరీష, ఆకునూరు సర్పంచ్ గోలి వసంత కుమార్, గండిగుంట సర్పంచ్ గెత్తం అనుపమ, పెదఓగిరాల సర్పంచ్ త్రిపురం లక్ష్మీ, ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, పార్టీ నాయకులు యుగంధర్ ప్రసాద్, వత్సవాయి ఏడుకొండలు, రామకృష్ణ, పోతురెడ్డి, జనసేన నాయకుడు ముప్పా రాజా తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో వైద్యశిబిరం19న

ఉంగుటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 19న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరదేశి తెలిపారు. బుధవారం ట్రస్ట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్(విజయవాడ), అకిరా కంటి ఆసుపత్రి(రాజమండ్రి) సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ వైద్యశిబిరంలో గుండె, మెదడు, నరములు, ఎముకలు, కీళ్ళు, ఊపిరితిత్తులు, రుమటాలజీ, సాధారణవ్యాధులకు ప్రముఖ వైద్యనిపుణులచే తగిన పరీక్షలు జరిపి అవసరమైన వైద్యసలహాలు మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9505012312 నెంబర్‌లో సంప్రదించాలని పరదేశి సూచించారు.

మద్యం అక్రమ విక్రేతల అరెస్టు

ఉంగుటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఆత్కూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తొండ్రు ప్రసాద్, పాతపాటి నాగేంద్రకుమార్‌లు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఇద్దరి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. నాగేంద్రకుమార్ వద్ద 30 క్వార్టర్లు, ప్రసాద్ వద్ద 19 క్వార్టర్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

చెత్తకుప్ప తొలగింపు



ఉయ్యూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] గండిగుంటలో సర్వీసు రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్త కుప్పల తొలగింపు పనులు పారిశుధ్య కార్మికులు చేపట్టారు. బుధవారం గండిగుంటలో పారిశుధ్యం అధ్వానం శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి స్పందించిన గ్రామపంచాయతీయ అధికారులు చెత్త తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

వెంకమ్మ హుండీ ఆదాయం రూ. 6,63,196

ప్రసాదంపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంకమ్మ పేరంటాలు అమ్మవారి హుండీ ఆదాయం రూ. 6,63,196లు కానుకులుగా భక్తులు సమర్పించారని ఈవో ప్రియాంక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణ అధికారులు, రామవరప్పాడు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

పీవీపీ సిద్ధార్థ విద్యార్థుల దాతృత్వం

పెనమలూరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విజయవాడకు చెందిన ఇంగు గౌరి అవినాష్ అనే 13 ఏళ్ల బాలుడికి పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు రూ. 60,250 విరాళంగా అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థులు అందించిన సాయం సొమ్మును ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు బాలుడి తల్లిదండ్రులకు అందించారు.



ప్రిన్సిపాల్ శివాజీబాబుకు చెక్కును అందిస్తున్న విద్యార్థులు

మద్దూరులో పొలం పిలుస్తోంది

కంకిపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరి పైరు దోమల బారినపడి దిగుబడి తగ్గే ప్రమాదముందని ఏవో పీఎం కిరణ్ అన్నారు. మండలంలోని మద్దూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆయన సూచనలు సలహాలు ఇచ్చారు. అదే విధంగా దోమల బెడద అధికంగా ఉన్న సమయంలో పురుగుల మందుకు వెళ్లకుండా ప్రథమంగా వేపనూనే ద్వారా దోమల బెడదను అధికమించవచ్చన్నారు. దోమల బెడద ఉధృతి అధికంగా ఉన్న సమయంలో మాత్రమే పురుగుల మందు వినియోగించాలని సూచించారు. వీఏఏ సురేష్, రైతులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగబోయే కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి కోరారు. బాపులపాడు మండల గ్రామాల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాలనుసారం బుధవారం ఎమ్మెల్సీ ఓట్ల నమోదు, ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంశీ, సుజాత, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

ఉంగుటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్య పరిరక్షణ, పశువులు, జీవాల(గొర్రెలు, మేకలు)సంరక్షణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల వ్యాప్తంగా పశువైద్యాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. తేలప్రోలులో సర్పంచ్ లాందిబోరా తదితరులు పాల్గొన్నారు.



జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న టీడీపీ నేతలు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి

పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మునిసిపాలిటీలో పారిశుధ్యం మెరుగుపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశించారు. బుధవారం పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన మునిసిపాలిటీ పరిధి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపాలిటీలోని నాలుగు క్లస్టర్లలో ఎక్కడ చూసినా చెత్త ఎక్కువ కనిపిస్తోందని, వర్షాలతో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఎప్పటి చెత్త అప్పుడే ఎత్తివేసి వీధులను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించే విధానంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. కొత్తగా పన్నులు వేయడానికి టీమ్‌లను ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా ఇంటిపన్నుల విధింపు పూర్తి చేసి మునిసిపాలిటీ ఆదాయాన్ని పెంచాలని ఆదేశించారు. దుకాణాల సముదాయాలకు వెంటనే లైసెన్సులు మంజూరు చేయాలన్నారు. టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకర రావు, కమిషనర్ భవానీప్రసాద్, డీఈ రాజారావు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

నోట్ల దండతో సత్కారం




వీరవల్లిలో సీసీ రహదారి శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే యార్లగడ్డను రూ. 100తో కూర్చిన భారీ మాలతో టీడీపీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహన బెనర్జీ సత్కరించారు.

- హనుమాన్ జంక్షన్‌రూరల్

ఒత్తి'ఢీ'

కాలేజీల్లో ఉన్నప్పుడు వరుస పిరియడ్లు. కాలేజీ పూర్తయ్యాక ప్రత్యేక తరగతులు. చదవడం, రాయడం నిత్యం ఇదే ప్రక్రియ. విద్యార్థులకు ఇచ్చే విశ్రాంతి చాలా తక్కువ. విశ్రాంతి వచ్చిందని ఉపశమనం తీసుకునేలోపు మళ్లీ ప్రత్యేక తరగతుల్లోకి వెళ్లిపోవాల్సి వస్తోంది. తర్వాత ఇంటికి వెళ్లినా గంటల కొద్దీ పుస్తకాలతో కుస్తీ పడాలి. ఫలితంగా విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. విరామం లేకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మానసిక ఒత్తిడితో మనోవేదనకు గురవుతున్నారు.

- ఆంధ్రజ్యోతి-విజయవాడ సిటీలైఫ్



- పగలంతా తరగతులు.. రాత్రయితే వర్కులు
- విశ్రాంతి లేక అల్లాడిపోతున్న విద్యార్థులు
- రాత్రి ఒంటిగంటకు వరకు వర్కులే వర్కులు
- ఉదయం 8 గంటలకే తరగతులు
- ఒత్తిడి, నిద్రలేమితో విద్యార్థుల అవస్థలు
- సైకాలజిస్టులకు పెరుగుతున్న కేసులు

విద్యార్థులపై పెరుగుతున్న చదువు భారం

కార్పొరేట్లు విద్యావ్యవస్థలోకి అడుగుపెట్టిన తర్వాత పోటీ పెరిగింది. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు రేటింగ్ ఉన్న విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. ఈ విషయంలో ఖర్చు కోసం వెనుకడుగు వేయట్లేదు. విద్యాసంస్థలు వాటి ప్రతిష్ఠను పెంచుకునేందుకు ఏటా పోటీ పడుతూనే ఉన్నాయి. ఎక్కువ మార్కులు, టాప్ ర్యాంకుల్లో విద్యార్థులను నిలబెట్టడానికి తరగతి గదుల్లో నలిపేస్తున్నారు. తరగతులు పూర్తయ్యాక వర్కులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఫలితంగా పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి.

కౌన్సెలింగ్ కేంద్రాల్లో పెరుగుతున్న విద్యార్థులు

సాధారణంగా వివిధ వ్యసనాలకు లోనైన వారిని సైకాలజిస్టుల వద్దకు తీసుకెళ్తుంటారు. కానీ, రెండు, మూడేళ్లుగా ఇలా కౌన్సెలింగ్‌కు వచ్చే వారిలో విద్యార్థులే ఎక్కువ కనిపిస్తున్నారు. నగరంలోని సైకాలజిస్టుల వద్దకు రోజుకు నలుగురైదుగురు పిల్లలు వస్తున్నారు. పెద్దలు 40-50 మంది వరకు ఉంటున్నారు. విద్యార్థులైతే రోజుకు 10-20 మంది వరకు వెళ్తున్నారు. ముఖ్యంగా ఇంటర్, పదో తరగతికి చెందిన విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం వస్తున్నారని సైకాలజిస్టులు చెబుతున్నారు. ఇలా వచ్చిన వారిలో గంటలకొద్దీ పుస్తకాలు పట్టుకుని కూర్చుంటున్న వారే ఎక్కువ మంది ఉంటున్నారు. కార్పొరేట్ కళాశాలలు ఉదయం 8 గంటలకే ప్రారంభమవుతున్నాయి. అప్పుడు కళాశాలకు వెళ్లిన విద్యార్థులు రాత్రి 7 గంటల వరకు నాలుగు గోడల మధ్యే ఉండాల్సి వస్తోంది. పదో తరగతిలో ఒకలా ఉన్న విద్యార్థుల టైమ్‌టేబుల్ ఇంటర్మీడియెట్‌కు వచ్చేసరికి పూర్తిగా మారిపోతోంది. ఇంటర్‌లో ఎంపిక చేసుకున్న గ్రూపులకు ప్లస్‌లు కలుస్తున్నాయి. ఒక్కో పిరియడ్‌ను సుమారు గంటపాటు నిర్వహిస్తున్నారు. ఐఐటీ, జేఈఈ వంటి కోర్సులు ఎంపిక చేసుకున్న విద్యార్థులకు గంటపాటు పాఠ్యాంశాల బోధన జరిగితే మరో గంట రీడింగ్ పిరియడ్ జరుగుతోంది. ఇలా రోజంతా విద్యార్థులు తరగతి గదుల్లో ఊపిరాడకుండా గడుపుతున్నారు. కళాశాల పూర్తయ్యాక ఒక్కో పాఠ్యాంశానికి సంబంధించి గంటన్నరకు పైగా హోంవర్క్‌లు ఇస్తున్నారు. వాటన్నింటినీ పూర్తి చేయడానికి ఆరేడు గంటలు పడుతుంది.

ఒత్తిడిని ఇలా తప్పించుకోవచ్చు

విద్యార్థులంతా టాపర్స్‌గా ఉండరు. ఒక్కొక్కరిలో ఒక్కోలా ఐక్యూ స్థాయిలుంటాయి. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గమనించాలి. విద్యార్థులకు ఒక టైమ్‌టేబుల్ అలవాటు చేయాలి. ఈ టైమ్‌టేబుల్‌లో తేడాలు రావడంతో పిల్లలు ఎక్కువగా మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ప్రతి మనిషి రాత్రి 8 గంటలపాటు నిద్ర అవసరం. ఈ నిద్ర లేనప్పుడు అన్ని రకాల సమస్యలు వస్తున్నాయి. తలనొప్పి, బీపీ, షుగర్, ఫిట్స్, మానసిక ఒత్తిడి, రక్తపోటు, భారీకాయం, గుండెపోటు వస్తున్నాయి. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఇచ్చే హోంవర్క్ విషయంలో ఆలోచించాలి. రాత్రి 10 గంటల్లోపు పూర్తయ్యేలా హోంవర్క్‌ను ఇవ్వడానికి విద్యాసంస్థలు టైమ్‌టేబుల్‌ను రూపొందించుకోవాలి.

- తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి.
- మెదడుకు ఎంత విశ్రాంతి ఇస్తే అంత మంచిది.
- మెదడు రిలాక్స్ కోసం ఇష్టమైన పనులు చేసుకోవాలి.
- మనసుకు నచ్చిన పనులు చేస్తే మెదడు రిలాక్స్ అవుతుంది.
- టైమ్‌టేబుల్ అలవాటు చేయాలి



- డాక్టర్ పామర్తి కృష్ణదాస్, మానసిక వైద్య నిపుణుడు

ఉపాధ్యాయులకు చెప్తున్నాం

మా అమ్మాయి ఎంజీ రోడ్డులో ఉన్న ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. ఇంటికొచ్చేసరికి రాత్రి 7 గంటలవుతుంది. కొద్దిసేపు మాత్రమే విశ్రాంతి తీసుకుంటుంది. తర్వాత పుస్తకాలతో హాల్లో కూర్చుంటుంది. నిద్రపోవడానికి ఒంటిగంట అవుతుంది. తిరిగి మళ్లీ వేకువజామున నిద్రలేస్తుంది. తగినంత సమయం నిద్ర లేకపోవడంతో ఇబ్బంది పడుతోంది. హోంవర్క్‌లు కొంచెం తగ్గించాలని ఉపాధ్యాయులకు చెప్పాం. ఎంచుకున్న కోర్సులు కఠినమైనవని, హోంవర్క్ కచ్చితంగా ఉంటుందని చెబుతున్నారు. అసలు ఈ కోర్సును పూర్తి చేయగలనా లేదా అనే ఒత్తిడితో మా అమ్మాయి ఉంటోంది. ఎప్పటికప్పుడు ఆమెకు కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. **- రామారావు, కృష్ణలంక**

కోకో ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా రాష్ట్రం

- ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్



కోకో పంట గురించి వివరిస్తున్న డాక్టర్ శ్రీనివాస్, చిత్రంలో డాక్టర్ ఫెమీనా శాస్త్రవేత్తలు

భారతీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రధాన కోకో ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్‌గా ఉందని ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలో కోచి కేంద్రంగా పనిచేస్తున్న డైరెక్టరేట్ ఆఫ్ క్యాష్యూ నట్ అండ్ కోకో డెవలప్‌మెంట్ (డీసీసీడీ), ఏపీ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎన్టీఆర్ కాలనీ వద్ద పార్క్ ఎన్ హోటల్‌లో కోకో పంటపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా, ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విజయవాడలో అధిక నాణ్యత గల మొక్కల ఉత్పత్తికి కోకో క్లోనల్ ఆర్చర్డ్ ఏర్పాటు చేశామన్నారు. కోకో పంట 30,552 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతూ 12,135 మెట్రిక్ టన్నుల డ్రైడ్ బీన్స్ వార్షిక దిగుబడి నమోదవుతుందన్నారు. విస్తీర్ణం, ఉత్పాదకత పరంగా ఏలూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఉందన్నారు. డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా మాట్లాడుతూ నర్సరీల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు, బాలాజీ నాయక్, హరినాథ్‌రెడ్డి, సహాయ సంచాలకులు సుధ, ఐకాన్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ఎలైస్ అప్సోరా, వైఎస్ఆర్‌హెచ్‌యూ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి, ఎన్టీఆర్ జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ పి.బాలాజీ కుమార్, శాస్త్రవేత్తలు, ఏజెన్సీలు, రైతులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత నగరం కోసం ఏం చేద్దాం

- నిపుణులతో వీఎంసీ కమిషనర్ సమావేశం



నిపుణులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు, కాలుష్య రహిత నగరానికి ఆ రంగ నిపుణులతో విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేస్ట్ వాటర్ ప్రాసెస్, పారిశుధ్య నిర్వహణ, నగరాభివృద్ధి దిశగా చర్చించారు. ఢిల్లీకి చెందిన కాస్మిక్ హిలోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సభ్యులు, కేజీఎంపీ పార్టనర్స్ నిపుణులు, వీఎంసీ ఎస్ఈ (ప్రాజెక్ట్) సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్ బాబు, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లాలో కొత్త రేషన్ దుకాణాలు

- విజయవాడ డివిజన్‌లో 61 రేషన్ షాపులు
- తిరువూరు డివిజన్‌లో 10 రేషన్ షాపులు
- నందిగామ డివిజన్‌లో 9 రేషన్ షాపులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రేషన్ కార్డుల బైఫరికేషన్ ప్రక్రియతో ఎన్టీఆర్ జిల్లాలో కొత్తగా 80 రేషన్ దుకాణాలు ఏర్పడబోతున్నాయి. విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యధికంగా 61 రేషన్ దుకాణాలు కొత్తగా ఏర్పాటు కానున్నాయి. ఇందులోనూ విజయవాడ నగరంలోనే అత్యధిక సంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది. తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 10 రేషన్ దుకాణాలకు, నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో 9 రేషన్ దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. నూతన చౌక దుకాణాలకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది. డీలర్ల ఎంపికకు సంబంధించి రాతపరీక్ష విధానంలో మెరిట్ ఆధారంగా ఎంపిక చేసే అవకాశం ఉంది. రాతపరీక్షలు ఉత్తీర్ణులైన వారిని విద్యార్హతలు, రిజర్వేషన్ల ప్రాతిపదికన ఎంపిక చేసే పరిస్థితి కనిపిస్తోంది. రేషన్ డీలర్ల నోటిఫికేషన్‌తో ఎన్టీఆర్ జిల్లాలో 80 మందికి ఉపాధి అవకాశాలు లభించే పరిస్థితి ఏర్పడబోతోంది.

అభ్యంతరాల తిరస్కరణ

జిల్లా వ్యాప్తంగా రేషన్ డీలర్లు విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలకు తమ అభ్యంతరాలను తెలిపారు. అభ్యంతరాలను పరిశీలిస్తే.. గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన క్రమంలో సచివాలయాల ప్రాతిపదికన మ్యాపింగ్ చేశారని, అది కూడా నాలుగేళ్లు కావస్తోందన్నారు. తర్వాత మధ్యలో ఎక్కడా మ్యాపింగ్‌ను క్రమబద్ధీకరణ చేయలేదన్నారు. చాలామంది చనిపోయిన వారున్నారని, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారున్నారని ముందు ఈ సమస్యలను పరిష్కరించి తర్వాత బైఫరికేషన్‌ను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రేషన్ డీలర్ల అభ్యంతరాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ ఆర్డీవోలు కొట్టివేశారు. దీనిపై మళ్లీ రేషన్ డీలర్ల సంఘం కోర్టును ఆశ్రయించేందుకు సన్నాహాలు చేస్తోంది.

లయోలాలో వైభవంగా వాల్మీకి జయంతి

విజయవాడ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో ప్రాచ్య భాషా పరిషత్ వాల్మీకి జయంతిని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆశ్వయుజ పూర్ణిమ తిథిని వాల్మీకి జయంతిగా జరుపుకుంటారు. ముఖ్య అతిథిగా సంస్కృత భాషా సేవకుడు, సంస్కృత భారతి బోధకవర్గ ప్రముఖుడు డాక్టర్ మరుదూరి నరసింహాచార్యులు విచ్చేసి మాట్లాడారు. సాధారణమైన వాక్యాలను కూడా తన కవిత్వంతో ఎంతో హృద్యంగా చెప్పిన మహా మనిషి వాల్మీకి అని విద్యార్థులకు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ జి.కిరణ్‌కుమార్ ఎస్‌జే, ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ జీఏపీ కిశోర్ ఎస్‌జె, ప్రాచ్య భాషా శాఖాధ్యక్షులు డాక్టర్ కె.శేఖర్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో నిర్వాహకుడిగా సంస్కృతాధ్యాపకుడు బి.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ డి.కృపారావు, సర్వేశ్వరరావు, హిందీ అధ్యాపకురాలు స్నేహల్ శుక్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

108లో డ్రైవర్లు, పైలెట్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 108లో పని చేసేందుకు డ్రైవర్లకు, పైలట్ల పోస్టులకు ఈనెల 17న భవానీపురం మార్కెట్ యార్డ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎండీ అష్ఫతుల్లా బుధవారం తెలిపారు. టెన్త్ పాసై ఇంగ్లీష్ చదవడం, రాయడం తెలిసి వారు 35ఏళ్లు నిండని వారు, హేవీ లైసెన్స్ కలిగిన వారు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారు ఎన్టీఆర్ జిల్లాలో పని చేయాలన్నారు. వివరాలకు 9963006867 నంబరును సంప్రదించాలన్నారు.

తైక్వాండోలో సెయింట్ ఆన్స్ సత్తా

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14,17 తైక్వాండో పోటీల్లో ప్రసాదంపాడులోని సెయింట్ ఆన్స్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు పాల్గొని పతకాలు వశం చేసుకున్నారు. అండర్-17 బాలికల 68 కేజీల విభాగంలో ఎస్ నాగ వెంకట శ్రీ నిఖ రజతం, బాలుర 51 కేజీల విభాగంలో ఎం మాధవ్ కాంస్యం వశం చేసుకున్నాడు.స్కూల్లో బుధవారం జరిగిన సభలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అరుణ మేరీ, కోచ్ అంకమ్మరావులు మెడల్స్ సాధించిన వారిని అభినందించారు.

22 నుంచి అండర్-19 క్రీడాజట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 క్రీడాజట్ల ఎంపికలను ఈ నెల 22, 23, 24, 29న వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్టు జిల్లా సెక్రటరీ వీ రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఉయ్యూరులోని ఏజీఅండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో కబడ్డీ (బాలురు మాత్రమే), 23న విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో, వుషూ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలను బాలబాలికలకు, అదేరోజు పీబీ సిద్ధార్థ కళాశాలలో వాలీబాల్, ఖోఖో బాలబాలికల జట్లను, 24న పీబీ సిద్ధార్థ కళాశాలలోనే బ్యాడ్మింటన్, క్రికెట్ జట్ల ఎంపికలను చేపడతామన్నారు. 24న బీఎస్ఆర్‌కే మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్లో మాల్కంబ్ ఎంపికలు, 29న మహానాడు రోడ్డులోని ఓల్గా అకాడమీలో ఆర్చరీ జట్ల ఎంపికలు చేపడుతున్నామని, ఫిజికల్ డైరెక్టర్లు గ్రహించి క్రీడాకారులను సెలక్షన్స్‌కు పంపాలని రవికాంత కోరారు.

పారదర్శకంగా ఇసుక అందించాలి

- జేసీ నిధి మీనా



ఇసుక నిల్వల వివరాలు తెలుసుకుంటున్న జేసీ డాక్టర్ నిధి మీనా

కంచికచర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత ఇసుకను పారదర్శకంగా అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా కంచికచర్ల మండలం పెండ్యాల-1, 2 రీచ్‌లకు సంబంధించి నందిగామ మండలం కంచెలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను, వత్సవాయి మండలం ఇందుగపల్లి, ఆళ్లూరుపాడు స్టాక్ పాయింట్లను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 15 రీచ్‌లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని, ముందుగా ఈ రోజు 4 రీచ్‌లు ప్రారంభించామని, 3.69 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. మిగతా 11 రీచ్‌లను నీటి ప్రవాహం తగ్గిన వెంటనే అందుబాటులోకి తెస్తామన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న కీసర, మొగులూరు స్టాక్ పాయింట్లతో కలిపి మొత్తం 15 రీచ్‌లలో 11 లక్షల 6 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. కొత్తగా ప్రారంభించిన రీచ్‌లలో టన్ను ఇసుక ధర రూ.232గా కమిటీ నిర్ణయించిందన్నారు. నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, గనులు, భూగర్భశాఖ సహాయ సంచాలకుడు వీరాస్వామి పాల్గొన్నారు.

హుండీల లెక్కింపులో మొదటిరోజు ఆదాయం రూ.3.50 కోట్లు



హుండీల లెక్కింపులో పాల్గొన్న ఈవో రామారావు, అధికారులు, సిబ్బంది

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో సాధారణ రోజులతో పాటు ఇటీవల జరిగిన దసరా మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు మొదటిరోజు బుధవారం లెక్కించగా రూ.3,50,28,700లు లభించినట్టు ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మహామండపం 6వ అంతస్తు వద్ద ఈవో పర్యవేక్షణలో భక్తులు సమర్పించిన కానుకలను సిబ్బంది లెక్కించారు. భక్తులు 15రోజుల పాటు సమర్పించిన కానుకల రూపంలో రూ.3,50,28,700 నగదు, 270 గ్రాముల బంగారం, 9 కేజీల 320 గ్రాముల వెండి ఆభరణాలు లభించినట్టు ఈవో తెలిపారు. 285 అమెరిన్ డాలర్లు, 20 యుఏఈ దిర్హమ్స్ 0.5 ఒమన్ రియల్స్ 100 బైసా, 2 మలేషియా రింగెట్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 50 కెనడా డాలర్లు, 5 కువైట్ దీనార్లు, 15 సౌదీ రియాల్స్ 15 ఇంగ్లండ్ పౌండ్లు, 160 ఆస్ట్రేలియా డాలర్లు, 6 సింగపూర్ డాలర్లు భక్తులు సమర్పించినట్లు తెలిపారు. గురువారం కూడా లెక్కింపు ఉంటుందన్నారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, ఏఈఓలు, సిబ్బంది, ఎస్‌పిఎఫ్, వన్‌టౌన్ పోలీసులు, సేవాదారులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం



మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీకామాక్షి స్వర్ణకార సంఘం నేతలు

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వన్‌టౌన్, గోల్డ్ మార్కెట్‌లోని శ్రీకామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంత్రి లోకేష్ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కేశనం భావనారాయణ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్ ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, బుధవారం కేబినెట్ సమావేశంలో కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలపటం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి, మంత్రి లోకేష్‌కు ధన్యావాదాలు తెలిపారు. తొలుత పాలాభిషేకం, అనంతరం కేక్ కట్ చేసి పంచారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.పి.చారి, కోశాధికారి సలీం, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.భాస్కర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కటకం మురళి, సంఘం నేతలు పాల్గొన్నారు.

రోగుల బంధువులకు ఆకలి తీర్చుతున్న 'తానా'



భోజనం వడ్డిస్తున్న కోఆర్డినేటర్ సురేష్

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో రోగులు, వారి వెంట వచ్చే బంధువులకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆకలి తీరుస్తోందని తానా ఫౌండేషన్ ట్రస్టీ, అన్నపూర్ణ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సురేష్ పుట్టగుంట అన్నారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో తానా, అన్నపూర్ణ పేరుతో ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసి బుధవారం నాటికి మూడేళ్లయిన సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తానా అన్నపూర్ణ ప్రాజెక్టు పేరుతో విజయవాడ, గుంటూరు, తెనాలి ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత ఆహార పంపిణీ సెంటర్లను చేశామన్నారు. వీటిని ఏర్పాటు చేసి బుధవారం నాటికి మూడేళ్లు పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు 3.40 లక్షల మందికి భోజనం వడ్డించినట్లు తెలిపారు.తానా ప్రెసిడెంట్ నిరంజన్ శృంగవరపు, ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ వల్లేపల్లి తదితరులు సురేష్ పుట్టగుంటను అభినందించారు.



మా బిడ్డను బతికించావయ్యా..!

- లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన శిశువు తల్లిదండ్రులు

జగ్గయ్యపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మా బిడ్డను బతికించావయ్యా.. అంటూ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు జగ్గయ్యపేటకు చెందిన చదల మహేశ్ దంపతులు. వివరాల్లోకి వెళితే గత సెప్టెంబరు 18న 14 రోజుల పసికందుకు ప్లేట్‌లెట్స్ పడిపోయాయి.. అత్యవసర, ఖరీదైన వైద్యం చేయించే స్తోమత ఆ తల్లిదండ్రులకు లేదు. ఆ క్షణంలో వారికి మంత్రి లోకేశ్ గుర్తొచ్చారు. క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే ఆయన నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు వెళ్లారు. అక్కడున్న మంత్రికి తమ దయనీయ స్థితిని, ప్రాణాలతో పోరాడుతున్న శిశువు గురించి తెలిపారు. వెంటనే స్పందించిన లోకేశ్ ఆంధ్రా ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి చికిత్స చేయించారు. దీంతో శిశువు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. రెండు రోజుల క్రితం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన శిశువును బుధవారం మంత్రి లోకేశ్ వద్దకు తీసుకెళ్లి తమ బిడ్డ ఈ రోజున క్షేమంగా ఉన్నాడంటే మీరే కారణమంటూ కృతజ్ఞతలు తెలిపారు.



దుర్గగుడి కళావేదికపై కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు.

అలరించిన కూచిపూడి నాట్యప్రదర్శన

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి కళావేదికపై బుధవారం పలువురు కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఇటీవల దుర్గగుడిలో జరిగిన దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 3 నుంచి 15 వరకు మహామండపం 7వ అంతస్తులో కళావేదికపై నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలను తాత్కాలికంగా రద్దు చేశారు. ఉత్సవాలు ముగియటంతో మళ్లీ బుధవారం నుంచి యథావిధిగా ప్రారంభించారు. దాచేపల్లి లక్ష్మీసుదేష్ణ, గ్రీష్మప్రియ, పి.హారిణి బ్రహ్మమొక్కటే, బ్రహ్మాంజలి అంశాలపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం ఈవో రామారావు కళాకారులకు ప్రశంసా పత్రాలు, లడ్డూ ప్రసాదం అందజేసి అభినందించారు.

నేడు ఆదిదంపతుల గిరిప్రదక్షిణ

ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా దుర్గగుడిలో గురువారం గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నట్టు ఈవో కేఎస్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.55 గంటలకు దుర్గగుడి టోల్‌గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.



2019, 2022లో ఆవిష్కరించిన శిలాఫలకాలు

శిలాఫలకాలకే పరిమితమా..!

- డీపీఆర్‌లు, శిలాఫలకాల ఆవిష్కరణలతో కాలక్షేపం
- పైలెట్ ప్రాజెక్టు నిర్వాహణకు ఆర్థిక చిక్కులు

(ఆంధ్రజ్యోతి-తిరువూరు): పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికై చెపట్టిన పైలెట్ ప్రాజెక్టు పనులు డీపీఆర్‌లకు, శిలఫలకాల ఆవిష్కరణలకే పరిమితం అవుతున్నాయనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పట్టణంలో రోజుకు ఒక వ్యక్తికి 135 లీటర్ల నీరు సరఫరా చేయల్సి ఉండగా ప్రస్తుతం 60 నుంచి 70 లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. సుమారు 40 వేలకు పైగా జనాభా గల పట్టణంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటి తాగునీటిని సరఫరా చేయడంలో విఫలం చెందిందనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. ప్రస్తుతం నడింతిరువూరులో(శాంతినగర్) 2.5 లక్షల లీటర్లకు, 1.5 లక్షల లీటర్లు, రాజుపేటలోని 2 లక్షల లీటర్లు, పాతతిరువూరులోని 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు నిర్మించి పైపులైన్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

పట్టణంలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారంకై ఆసీయ మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంక్(ఏఐఐబి)నిధులతో, విజయవాడ పెర్రి వద్ద కృష్ణానది నుంచి ప్రత్యేకంగా పైపులైన్లు ఏర్పాటు చేశారు. తాగునీటి సరఫరాకై సుమారు 4 సంవత్సరాల క్రితం రూ.90 కోట్లతో పైలెట్ ప్రాజెక్టు డిపిఆర్‌లు(ప్రాజెక్టు సమగ్ర ప్రణాళిక) రూపొందించారు. ఈ ప్రాజెక్టుపై సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘచర్చలు, డిపిఆర్‌లో అంచనాల మార్పుతో ప్రాజెక్టు విలువ రూ.110 కోట్లకు చేరుకుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2019 ఫిబ్రవరి 13న మున్సిపల్ కార్యాలయం సమీపంలో శిలఫలకాన్ని ఏర్పాటు చేశారు. తదుపరి ఎన్నికలు రావడంతో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఎన్నికల తదుపరి వైసీపీ ప్రభుత్వం హాయంలో రూపొందించిన ప్రతిపాదనల ప్రకారం ఈ పైలెట్ ప్రాజెక్టు ఖర్చు సుమారు రూ.162 కోట్లకు చేరుకుంది. గతంలో పట్టణంలో తాగునీటి సరఫరాకు పెర్రినుంచి చెపట్టిన పైలెట్ ప్రాజెక్టు మంజూరైందని అప్పటి నాయకులు హడావిడి చేశారు. శాంతినగర్‌లో మున్సిపల్ తాగునీటి సరఫరా చే సే ట్యాంక్‌ల వద్ద, పైలైట్ ప్రాజెక్టుకు సం బంధించి సుమారు 10 లక్షల లీటర్ల సామర్థ్యంగల ట్యాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ నిర్మాణం బెస్‌మెంట్ వరకు వచ్చి నిలిచిపోయింది. తదుపరి పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించి పట్టణంలో ఎఐఐబి నిధులు రూ.27.69 కోట్లతో పైపులైన్ల ఏర్పాటు పేరుతో 2022 జూన్ 27న మరో శిలఫలకం ఆవిష్కరించారు. పైపులైన్ నిర్మాణం పేరుతో పలు వార్డుల్లో సిమెంట్ రోడ్లు ధ్వంసం చేశారు. పట్టణంలో దీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికై చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు డిపిఆర్‌కే పరిమితం అవుతుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకై పెర్రినుంచి చెపట్టిన తాగునీటి పైలెట్ ప్రాజెక్టు నిర్వాహణా వ్యయం, మున్సిపాలిటికి భారంగా మారుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తిరువూరు నగర పంచాయతీపై పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించి నెలకు సుమారు రూ.10 లక్షల వ్యయం భారం పడుతుంది. ఇప్పటికే మున్సిపాలిటి తాగునీటి సరఫరాకు సంబంధించి విద్యుత్‌బిల్లు సుమారు రూ.6 లక్షలు చెల్లిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పైలెట్ ప్రాజెక్టు విద్యుత్ బిల్లు చెల్లింపు మున్సిపాలిటికి కష్టాసాధ్యంగా మారుతుంది.

నిలిచిపోయిన ఏఐఐబీ ప్రాజెక్టు పనులు

రాష్ట్రంలో మొత్తం 34 మున్సిపాలిటీలకు తాగునీటి పైలెట్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎఐఐబి నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం మారిన డీపీఆర్ అంచనాల ప్రకారం ఎఐఐబీతో తిరిగి అగ్రిమెంట్ కుదుర్చుకోవాలి. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టు అంశం ప్రభుత్వం వద్ద ఉంది. త్వరలో ప్రాజెక్టు పనులు చెపట్టే అవకాశం ఉంటుంది.

- లోవరాజు, (మున్సిపల్ కమిషనర్)

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.505

నట్టల నివారణ మందు వేయించండి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో 1,31,520 గొర్రెలు, 24,295 మేకలు ఉన్నాయి. ఈనెల 31 వరకు నట్టల నివారణ మందు వేస్తున్నాం. వైద్యులు వచ్చి మందు వేస్తారు. పెంపకందారులు శ్రద్ధగా వేయించుకోవాలి.' అని పశు సంవర్ధక శాఖ జేడీ సీహెచ్ నరసింహారావు సూచించారు. గోపువానిపాలెంలో గొర్రెలకు ఏడీ డాక్టర్ రమణయ్యతో పాటు ఆయన బుధవారం నట్టల నివారణ మందు వేశారు.

క్యాంపుబెల్‌పేటకు బస్సు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోనేరుసెంటర్ నుంచి క్యాంపుబెల్‌పేటకు బుధవారం నుంచి నూతనంగా ఆర్టీసీ బస్సు సర్వీసును గ్రామ మాజీ సర్పంచ్ వి.నాగుల్‌మీరా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు సేవలు వినియోగించుకోండి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ సెంటర్‌లో నూతనంగా ప్రారంభించిన గుంటూరు అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకును ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. బ్యాంకు చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, సీఈవో ఎం.సంజీవరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఆ పార్టీ సీనియర్ నాయకుడు బండ్రెడ్డి రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ పాల్గొన్నారు.



బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ



ఘంటసాలలో తహసీల్దార్ విజయప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళలు, స్థానికులు

ఇళ్ల మధ్య మద్యం షాపు పెట్టొద్దు

ఘంటసాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్రం సెంటర్ సమీపంలోని మల్లంపల్లి రోడ్డులో నూతన మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దంటూ పరిసర ప్రాంత మహిళలు, స్థానికులు బుధవారం నిరసన తెలిపారు. గతంలో మద్యం షాపు నిర్వహించిన ప్రాంతానికి చేరుకున్న ఆ ప్రాంతవాసులు తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. 24 గంటలూ మద్యం అందుబాటులో ఉండటంతో మందుబాబుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయని, మద్యం షాపుల చుట్టూ బెల్టుషాపులు ఏర్పాటు చేయటంతో మందుబాబులు ఉదయం నుంచి పొద్దుపోయే వరకు ఈ ప్రాంతంలోనే ఉంటున్నారని, రాకపోకలు సాగిస్తున్న ప్రజలు, మహిళలకు ఆటంకాలు కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మద్యం తాగి తమ నివాస ప్రాంతాల సమీపంలోనే మూత్ర విసర్జన చేస్తున్నారని, తాగిన బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు అక్కడే పడేస్తున్నారని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారుల్లో మద్యం విక్రయించుకునేలా లైసెన్స్ దారుడికి అనుమతులివ్వాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ బి.విజయప్రసాద్, మొవ్వ ఎక్సైజ్ అధికారులకు వారు వినతిపత్రాలు అందించారు.



మోపిదేవిలో ఆలస్యంగా ప్రారంభమైన దుకాణం వద్ద గుమిగూడిన మద్యం ప్రియులు

మద్యం కోసం ఎదురుచూపులు

మోపిదేవి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల ప్రారంభం బుధవారం ఆలస్యం కావడంతో మద్యం ప్రియులు మందు కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. మండలానికి మూడు దుకాణాలు కేటాయించగా, పెదకళ్లేపల్లిలో 1, మోపిదేవిలో 2 ఏర్పాటు చేశారు. మోపిదేవిలో మద్యం సరఫరా కాకపోవటంతో ఉదయం నుంచి మద్యం ప్రియులు ఎదురుచూడాల్సి వచ్చింది. రాత్రి 7 గంటలకు ఒక దుకాణానికి మాత్రమే మద్యం సరఫరా అయ్యింది. మద్యంప్రియులు వాహనం చుట్టూ గుమిగూడారు. దుకాణం ఎప్పుడు ప్రారంభిస్తారో, విక్రయిస్తారోనని వేచిచూశారు.

క్షిపణి పరీక్షా కేంద్రంతో దివి ప్రాంత అభివృద్ధి

● ఎన్ఆర్ఐ, టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్

అవనిగడ్డ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుల్లలమోదలో క్షిపణి పరీక్ష కేంద్రానికి అనుమతులు ఇస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దివి ప్రాంత అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని ఎన్ఆర్ఐ, టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రానికి భూముల కేటాయింపు, పర్యావరణ అనుమతులు రావటంలోనూ 2014లో టీడీపీ ప్రభుత్వం కృషి చేసిందని, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. క్షిపణి కేంద్రం ఏర్పాటుతో దివి ప్రాంతంలో రహదారులు, రైల్వేలైన్లు, మౌలిక సౌకర్యాలు సమకూరుతాయని పేర్కొన్నారు. ఎన్నో వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బుద్ధప్రసాద్ కృషితోనే క్షిపణి కేంద్రం మంజూరు

నాగాయలంక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితోనే గుల్లలమోదకు డీఆర్డీవో క్షిపణి పరీక్షా కేంద్రం మంజూరు సాధ్యమైందని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి, టీడీపీ జిల్లా నేత లకనం నాగాంజనేయులు, సంఘ నేతలు పేర్కొన్నారు. బుధవారం నాగాయలంక పడవల రేవు వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగాంజనేయులు మాట్లాడారు. కృష్ణాజిల్లా, దివిసీమ అభివృద్ధికి ఇదొక మహత్తర ప్రాజెక్టుగా చరిత్రలో నిలుస్తుందన్నారు. బుద్ధప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకార నేతలు పాల్గొన్నారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

చల్లపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్న మన కోసం మనం ట్రస్ట్‌కు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ రూ.లక్ష విరాళం అందించారు. బుధవారం చల్లపల్లిలో స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు చెక్కు అందించారు.



డీఆర్కేకు విరాళం అందిస్తున్న గొర్రెపాటి గోపీచంద్

సీవేజ్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పెడన రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ మండల వ్యవసాయాధికారిణి నూరున్నీసాలు స్థల పరిశీలన జరిపారు. పట్టణంలోని 15వ వార్డు రైల్వే ట్రాక్ పక్కన, రెండో వార్డు డంపింగ్ యార్డ్ సమీపంలో, కట్లపల్లి ప్రాంతాల్లో స్థలాలను వారు పరిశీలించారు. మరోసారి పరిశీలించి తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. టీపీవో సుజనకుమారి, మండల సర్వేయర్ దాసు, వీఆర్వోలు ఉన్నారు.

ప్రమాదకరంగా..

కాజ బెయిలీ బ్రిడ్జి

● పగిలిపోయిన వంతెన ప్లాట్‌ఫాం రేకులు
● శాశ్వత వంతెన నిర్మించాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి)

మొవ్వ మండలం కాజలోని ఐనంపూడి డ్రెయిన్‌పై పదిహేనేళ్ల క్రితం నిర్మించిన బెయిలీ బ్రిడ్జి నేడు ప్రమాదకరస్థితికి చేరింది. ఐనంపూడి డ్రెయిన్‌పై 8 దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రజల ఇబ్బందులు దృష్ట్యా తాత్కాలికంగా తేలికపాటి వాహనాలు మాత్రమే రాకపోకలు సాగించేలా అప్పట్లో బెయిలీ బ్రిడ్జి(ఇనుప వంతెన) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ వంతెన ప్లాట్‌ఫాం రేకులు పగిలిపోవటమే కాకుండా రేకులు పైకి లేచి ప్రమాదకరస్థితికి చేరుకున్నాయి. తేలికపాటి వాహనాలకే వంతెన ఊగిపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శాశ్వత వంతెన నిర్మించాలని ఈ ప్రాంతవాసులు అనేక పర్యాయాలు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. మొవ్వ నుంచి జిల్లా కేంద్రమైన మచిలీపట్నం వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. విద్యార్థులు, వ్యాపారులు, ప్రజానీకం ఈ మార్గం ద్వారా రోజూ మచిలీపట్నం వెళ్తుంటారు. రైతులకు పొలాలకు వెళ్లేందుకు పండించిన ఉత్పత్తులు తరలించేందుకు ఈ వంతెన ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ప్రమాదరకంగా ఉండడంతో ఎప్పుడు ఏమవుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



శిథిలావస్థకు చేరిన బెయిలీ బ్రిడ్జి



పగిలిపోయిన ప్లాట్‌ఫాం రేకులు

అనేక ప్రమాదాలు జరిగాయి



ఐనంపూడి డ్రెయిన్‌పై శాశ్వత వంతెన నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు అర్జీలు అందించాం. రాకపోకలు సాగించేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ వంతెనపై అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి. అధికారులు వంతెన నిర్మించాలి.

-తాతా నారాయణ, మాజీ ఎంపీపీ

యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మించాలి



యుద్ధప్రాతిపదికన శాశ్వత వంతెన నిర్మించాలి. రెండేళ్ల కాల పరిమితికి ఇనుప వంతెన నిర్మించారు. పదిహేనేళ్లయినా అధికారులు దృష్టిసారించలేదు. ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

-మండా శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● 'పల్లె పండుగ'లో ప్రారంభించిన పనులు సంక్రాంతి లోపు పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



నాగేశ్వరరావుపేట ఆర్బీకే భవనం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ప్రారంభించిన పనులు సంక్రాంతి లోపు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం నాగేశ్వరరావుపేట, జానకిరామాపురం, మల్లేశ్వరం గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ పంచకర్ల సురేష్, నజీర్, యిల్లారి లీలాకృష్ణ, తాతా మహాలక్ష్మి, కాశీ, మలిశెట్టి వెంకటరమణ, దాసరి కరుణజ్యోతి, గంధం సత్యనారాయణ, సీడీపీవో సముద్రవేణి, ఎంఈవో త్రిపుర సుందరి, డాక్టర్ పవన్ కుమార్, ఏఈ నగేష్ కుమార్ పాల్గొన్నారు.



అరిసేపల్లిలో రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు

గ్రామాల్లో రోడ్లకు శంకుస్థాపన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అరిసేపల్లి, బొర్రపోతుపాలెం, సుల్తానగరం, కరగ్రహారం, చినకరగ్రహారం గ్రామాల్లో రోడ్ల నిర్మాణపనులకు మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ కుంచే నాని, తలారి సోమశేఖర్ శంకుస్థాపన చేశారు.

ఘంటసాలపాలెంలో రూ.13.50 లక్షలతో..

ఘంటసాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలపాలెంలో ప్రధాన రహదారి నుంచి బీఈ కాలనీకి రూ.13.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు సర్పంచ్ దోనె రజనీకుమారితో కలిసి టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు శంకుస్థాపన చేశారు. కంచర్ల లక్ష్మి, వేమూరి సాయివెంకటరమణ కార్యదర్శి బోలెం అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

3 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అవనిగడ్డ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలో అనధికారికంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వాహనాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. 2వ వార్డు సమీపంలో కోసూరు రాజారావుకు చెందిన వాహనంలో సుమారు మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా, వాహనాన్ని నిలుపుదల చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

అవనిగడ్డ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కేంద్రాన్ని జిల్లా అధ్యక్షుడు బి.కనకరావు ప్రారంభించారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని, 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన ఎవరైనా సరే నవంబరు 6వ తేదీలోపు యూటీఎఫ్ సేవా కేంద్రం ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

శంకరమఠంలో వేదపఠనం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గొడుగుపేటలోని శంకరమఠంలో బుధవారం రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు జిల్లాల నుంచి వచ్చిన 200 మంది వేదపండితులు అథర్వణ వేదం, సామవేదాన్ని సుస్వరంగా పఠించారు. సామూహిక వేద పఠనం వేదఘోషగా మారి ఆ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కౌతావారి వేద సభలో వేదపండితులను ఘనాపాటి విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ, సింగరాజు గోవర్ధన్ ఘనంగా సత్కరించారు.



అథర్వణ వేదం పఠిస్తున్న పండితులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

సీఎన్జీ యూనిట్ నెలకొల్పాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో మరో సీఎన్జీ యూనిట్‌ను నెలకొల్పాలంటూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆటో కార్మికులు ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాకు నాయకుడు బి.సుబ్రహ్మణ్యం నాయకత్వం వహించారు. మచిలీపట్నంలో 500ల ఆటోలు సీఎన్జీతో నడుపుతున్నారని, గ్యాస్ దొరక్క ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్యాస్ కోసం పెడన, పామర్రు వెళ్లాల్సి వస్తోందని, ఆటోడ్రైవర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. మచిలీపట్నంలో సీఎన్జీ బంకు వెంటనే పునరుద్ధరించాలని, మరో సీఎన్జీ బంకును ప్రారంభించాలని కోరారు. ఆటో వర్కర్ల సంఘ నాయకులు కరీముల్లా, షేక్ బాజీ, బాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరం

పెడన రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం నేరం. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.' అని జిల్లా రవాణా అధికారి మనీషా సూచించారు. నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రత, అతివేగం వలన కలిగే ప్రమాదాలపై విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. ఎంహెచ్‌వీ శ్రీనివాస నాయక్, సిద్ధిక్, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరెక్టర్ దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ టీఆర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మెడికల్ కళాశాలలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రామకృష్ణయ్య

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి రామకృష్ణయ్య సూచించారు. మెడికల్ కళాశాలలో బుధవారం ర్యాగింగ్ నియంత్రణ చట్టాలు, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలు, సోషల్ మీడియాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఎక్కడైనా గంజాయి, మాదక ద్రవ్యాలు అమ్ముతున్నట్టు తెలిస్తే 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ వాసా వెంకటేశ్వరరావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149,160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

వరద బాధితులకు రూ.1.16 లక్షల విరాళం

గుడివాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ఏఎన్ఆర్ కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు రూ.1,16,000 చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఉండవల్లిలోని ఆయన నివాసంలో బుధవారం అందజేశారు. కళాశాల పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్ అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెక్కును అందజేస్తున్న ఏఎన్ఆర్ కళాశాల యాజమాన్యం

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు

- తాగునీటి సమస్యకు పరిష్కారం చూపడం సంతోషదాయకం
- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్

గుడివాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్యలు తెలిపిన వెంటనే స్పందించి, నియోజకవర్గంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని అధికారులకు ఆదేశించిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం జనసేన నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఇరవై ఏళ్లు ఎమ్మెల్యేగా పని చేసిన వ్యక్తికి సాధ్యం కాని పనిని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేసి చూపించా రన్నారు. నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ఎమ్మెల్యే వెనిగండ్లకు జనసేన పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. నాయకులు మజ్జి శ్రీనివాసరావు, సుంకర వెంకట్, గుండు వెంకట్రావు, గునుకుల వినోద్, వెంకటేష్, నరేష్, పవన్ పాల్గొన్నారు.

కౌతవరంలో పెట్రోల్ బంక్ ప్రారంభం నేడు



గుడ్లవల్లేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కౌతవరంలో నేడు పలు ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామని టీడీపీ నాయకుడు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యచౌదరి తెలిపారు. గ్రామంలో ఆధునీకరించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం, కౌత వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్), నిర్వహించే హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర ప్రారంభిస్తారని సుబ్రహ్మణ్యచౌదరి తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అనగాని సత్యప్రసాద్, హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను కొల్లు రవీంద్ర ప్రారంభిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సభాధ్యక్షత వహిస్తారని, ఎంపీ వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, కేడీసీసీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

మార్కెటింగ్ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు

గుడివాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని, విద్యార్థులు తమలో దాగి ఉన్న నైపుణ్యాలను మెరుగుపరుచుకుని మార్కెటింగ్ రంగంలో రాణించాలని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.రమేష్ అన్నారు. బుధవారం ఏఎన్నార్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు మార్కెటింగ్ రంగంలోని అవకాశాలు, స్టాక్ ఎక్స్ఛేంజ్ లావాదేవీలపై రమేష్ ఉపన్యాసమిచ్చారు. పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్కేప్రసాద్, కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎం.సువర్చల పాల్గొన్నారు.

రహదారి అధ్వానం!

- గుంతలమయంగా గుడివాడ-దొండపాడు రహదారి
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-గుడివాడ రూరల్)

గుడివాడ నుంచి దొండపాడు వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా ఉంది. ఐదు కిలోమీటర్ల మేర ఉండే ఈ రహదారిపై దొండపాడు, మోటూరు, గుంటా కోడూరు, గోల్వేపల్లి, సైదేపూడి గ్రామాల ప్రజలు వేలాది మంది రోజూ ఉద్యోగ, విద్య, వ్యాపార, ఇతర అవసరాల కోసం ప్రయాణిస్తుంటారు. మోటూరు మీదుగా వెళ్లాలంటే రైల్వేగేటు పడుతుందని ఎక్కువ మంది దొండపాడు మీదుగానే వెళ్తుంటారు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం మరమ్మతులకు నోచుకోలేదని, ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదని, అధికారులు, నాయకులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల ప్రజా దర్బార్‌కు దొండపాడుకు వచ్చిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఈ రహదారికి రూ.45 లక్షలు మంజూరవుతుందని తెలిపారు. ఈ నిధులతో త్వరగా రహదారిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుడివాడ-దొండపాడు రహదారిపై గుంతలు

రూ.40 లక్షలు మంజూరయ్యాయి

దొండపాడు - గుడివాడ ఆర్ అండ్ బీ ప్రధాన రహదారికి తక్షణ మరమ్మతుల నిమిత్తం రూ.40 లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచాం.

- శ్రీనివాసరావు, ఆర్ అండ్ బీ, డీఈ

ఇబ్బంది పడుతున్నాం



గుడివాడ - దొండపాడు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. మోటూరు నుంచి తిరిగి రావాల్సి వస్తోంది. రాత్రి పూట చాల ఇబ్బందిగా ఉంటోంది. సమస్యకు పరిష్కారం చూపాలి.

- జంపాన నాగేశ్వరరావు

అధికారులు స్పందించడంలేదు



ఐదేళ్లపై నుంచి రహదారి సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. త్వరగా రహదారి నిర్మించాలి.

- ధనికొండ కృష్ణ

ప్రజారోగ్యానికి తూట్లు పొడిస్తే చర్యలు

- ఏరియా ప్రభుత్వాస్పత్రిలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకస్మిక తనిఖీలు
- ఆహారం బాగోలేదని ఫుడ్ కాంట్రాక్టర్‌పై ఆగ్రహం

గుడివాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): 'ప్రజారోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఎవరైనా అందుకు తూట్లు పొడిస్తే కఠిన చర్యలు తప్పవు.' అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హెచ్చరించారు. బుధవారం ఏరియా ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. నాణ్యత లేని అన్నం, నీళ్ల సాంబారు, కూరలను చూసి ఫుడ్ కాంట్రాక్టర్‌పై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తంచేశారు. రోగులకు అందించే ఆహారాన్ని ఆస్పత్రి వైద్యాధికారులు రోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాల్లో చెత్త పేరుకుపోయి ఉండడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు తమ తీరును మార్చుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు జగన్మోహనరావు, సాంబయ్య, జబీన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవి, వైద్య అధికారులు పాల్గొన్నారు.



అన్నం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



పుట్టగుంటలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

పల్లె పండుగతో మంచి రోజులు

నందివాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలకు మంచి రోజులు వస్తున్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం పెదలింగాల, చినలింగాల, పుట్టగుంట గ్రామాల్లో సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని గ్రామాల్లో సైడ్ డ్రెయిన్లు నిర్మిస్తామని ఆయన తెలిపారు. బుడమేరు తవ్వకాలు జరగక పోవటం వల్ల నందివాడ మండలం ముంపు బారిన పడిందని, త్వరలో బుడమేరు, కాలువల్లో పూడిక తీయిస్తామని, అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి(బాబ్జి), యలమంచిలి సతీష్, దానేటి సన్యాసిరావు, నంబూరి రాకేష్, మురళి, రాంబాబు, రాజేశ్వరరావు, మద్దాల ఇస్సాకు, కొడాలి రవికుమార్, రవి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం తోట్లవల్లూరులో రూ.59 లక్షలతో ఆరు సిమెంటు రోడ్లకు, యాకమూరులో రూ.14.20 లక్షలతో రెండు సిమెంటు రోడ్లు, పెనమకూరులో రూ.40.71 లక్షలతో ఏడు సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి, శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వమొచ్చాక రహదారుల అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకుంటోందని వివరించారు. సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న తీరు ప్రజలకు మేలు చేస్తుందన్నారు. టీడీపీ నాయకులు వీరంకి వెంకట గురుమూర్తి, వీరపనేని శివరామ్‌ప్రసాద్, నెక్కలపూడి మురళి, జనసేన మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణసుమన్, అధికారులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

పమిడిముక్కల : జన్మించిన గ్రామానికి సేవచేయాలన్న సంకల్పంతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు హనుమంతపురంలో మండవ సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మండవ వెంకటేశ్వరరావు, మనవడు లింగమనేని వెంకట్రామయ్య సహాయంతో లింగమనేని యూత్ ఆధ్వర్యంలో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు, టీడీపీ సీనియర్ నాయకుడు వీరపనేని వీరేంద్ర, దొప్పలపూడి శంకరరావు, బొల్ల మల్లికార్జున, పరుచూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





తోట్లవల్లూరులో సిమెంటు రోడ్డు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా..
హనుమంతపురంలో మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవంలో..

అండర్‌పాస్ వద్ద నీటి సమస్య పరిష్కరించండి

పమిడిముక్కల : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై తాడంకి సమీపాన అండర్‌పాస్‌వద్ద వర్షపు నీరు నిలుస్తోందని సమస్యను పరిష్కరించాలని జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి దృష్టికి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తీసుకెళ్లారు. పీడీ శ్రీనివాసరెడ్డి బుధవారం తాడంకి రాగా ఎమ్మెల్యే ఆయనను అండర్‌పాస్ వద్దకు తీసుకువెళ్లి మోకాలు లోతు నిలిచిన నీటిని చూపారు. వాహనచోదకులు పడుతున్న ఇబ్బందిని వివరించారు. దీంతో పీడీ ఇంజనీర్లను పిలిపించారు. సమస్య ఉత్పన్నం కాకుండా చూస్తామని ఎమ్మెల్యేకు ఆయన హామీ ఇచ్చారు.

అకాల వర్షాలతో వరిలో తెగుళ్లకు ఆస్కారం

గుడివాడ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా వరికి తెగుళ్ల ఆశించే అవకాశం ఉంటుందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ ఎస్.రమాదేవి సూచించారు. బుధవారం లింగవరం పరిధిలోని మెరకగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరి పొలాల్లో అధికంగా నీళ్ల ఉంచొద్దని ఆమె సూచించారు. ఎక్కువగా పెరిగిన వరి పడిపోయే ప్రమాదం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లింగవరం, వలివర్తిపాడు, మెరకగూడెం రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈవో బి. అనంతలక్ష్మి, వీఏఏ అనిత, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మెరకగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి



రీజనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు ఎంపికైన డాక్టర్ కేకే ఆర్స్ విద్యార్థులు

మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు డాక్టర్ కేకేఆర్స్ విద్యార్థులు

గుడివాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు అర్హత సాధించారని పాఠశాల ప్యాక్ట్ ప్రిన్సిపాల్ ఎం.రామిరెడ్డి తెలిపారు. మ్యాథమేటిక్స్ టీచర్స్ అసోసియేషన్(ఇండియా) నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైర్ ఇన్ మ్యాథమేటిక్స్(ఐక్యూఎం) పోటీ పరీక్షల్లో 12 మంది విజయం సాధించారని వారంతా నవంబరు 3వ తేదీన రెండో లెవల్ ఆర్ఎంవోలో పాల్గొంటారని ఆయన తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో విజయం సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్స్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

పామర్రు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చెన్నైలో ఈనెల6న నిర్వహించిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఏఎన్ఎం విద్యార్థులు వెండి, కాంస్య పతకాలు గెలుచుకున్నారు. విజేతలైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎ.పూర్ణచంద్రారెడ్డితోపాటు ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్ అభినందించారు. కరాటే కోచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

పామర్రు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నిమ్మకూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.13.50 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి అధికారులతో కలిసి ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచ్ పడమటి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ నందమూరి జయకృష్ణప్రసాద్, ఎంపీడీవో కె.జ్యోతి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సురేష్, తిరుప తిరావు, పీఆర్ ఏఈ పి.రామారావు పాల్గొన్నారు.